తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
వరంగల్ | గురువారం - 11- జూన్ 2026 | సంపుటి : 4 | సంచిక : 7 | పేజీలు - 8 | వెల : రూ 7 | www.telanganamuchatlu.in

# బీసీలకు 50 % రిజర్వేషన్ల సాధన కోసం ఉద్యమం

## టిఆర్ఎస్ పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత

హైదరాబాద్,జూన్10(తెలంగాణ ముచ్చట్లు): చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య, శ్రీకాంతాచారిల ఆశయాలను కొనసాగిస్తూ బీసీ రిజర్వేషన్ల సాధన కోసం ఉద్యమాన్ని ప్రారంభించినట్లు తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత తెలిపారు. బుధవారం బంజారాహిల్స్‌లోని టీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన బీసీ నాయకుల సమావేశంలో ఆమె మాట్లాడారు. బీసీలకు విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల పెంపు కోసం జరిగిన ఉద్యమాల ఫలితంగానే రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ, శాసన మండలిలో తీర్మానాలు ఆమోదించి కేంద్రానికి పంపిందన్నారు. అయితే బిల్లుల ఆమోదం కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంలో రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టడం లేదని విమర్శించారు.

దేశవ్యాప్తంగా బీసీలకు 50 శాతం రిజర్వేషన్ల సాధన లక్ష్యంగా ఉద్యమాన్ని విస్తరించనున్నట్లు కవిత వెల్లడించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలంగాణ రక్షణ సేన తరపున పోటీ చేసే అభ్యర్థుల్లో 50 శాతం మందికి బీసీ వర్గాలకు చెందిన నాయకులకు అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. బీసీ సమాజానికి రాజకీయంగా మరింత ప్రాధాన్యం కల్పించే దిశగా తమ పార్టీ కట్టుబడి ఉందని పేర్కొన్నారు.





# భారతీరాజా మృతిపై సీఎం దిగ్భ్రాంతి

- చిత్రసీమకు తీరని లోటు
- విశిష్ట సేవలను స్మరణ
- కుటుంబానికి సానుభూతి

హైదరాబాద్, జూన్ 10 (తెలంగాణ ముచ్చట్లు): ప్రముఖ నటుడు, దర్శకుడు, పద్మశ్రీ పురస్కార గ్రహీత భారతీరాజా మరణం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దాదాపు నాలుగు దశాబ్దాల పాటు భారతీయ చలనచిత్ర రంగంలో తనదైన ముద్ర వేసిన భారతీరాజా మృతి చిత్రసీమకు తీరని లోటని పేర్కొన్నారు. ఆయన సేవలను స్మరించుకుంటూ కుటుంబ సభ్యులకు, అభిమానులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. భారతీరాజా దర్శకుడిగా, నటుడిగా విశేష ఖ్యాతిని సంపాదించారని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. గ్రామీణ జీవన విధానం, మానవ సంబంధాలు, సామాజిక అంశాలను ప్రతిబింబించే ఎన్నో చిత్రాలను రూపొందించి ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారని అన్నారు. తన ప్రత్యేక కథన శైలి, సృజనాత్మక దృష్టితో భారతీయ చిత్రసీమలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారని కొనియాడారు. వివిధ భాషల్లో అనేక వైవిధ్యభరితమైన, సందేశాత్మక చిత్రాలను తెరకెక్కించి భారతీయ చలనచిత్ర రంగ అభివృద్ధికి ఆయన విశేష కృషి చేశారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఎన్నో కొత్త ప్రతిభలను చిత్రరంగానికి పరిచయం చేసి, అనేకమందికి మార్గదర్శకుడిగా నిలిచారని అన్నారు. ఆయన చిత్రాలు నేటికీ ప్రేక్షకులను ఆలోచింపజేస్తూ స్ఫూర్తినిస్తున్నాయని తెలిపారు.

మిగతా 2లో



# 'పెద్ది' టికెట్ ధరలపై హైకోర్టు ప్రశ్నలు

- ప్రభుత్వ ఉత్తర్వులపై న్యాయస్థానం వ్యాఖ్యలు
- చట్టవిరుద్ధంగా కనిపిస్తున్నాయని అభిప్రాయం
- విచారణ ఈ నెల పదిహేనుకు వాయిదా

హైదరాబాద్, జూన్ 10 (తెలంగాణ ముచ్చట్లు): ప్రముఖ నటుడు రామ్ చరణ్ కథానాయకుడిగా నటించిన 'పెద్ది' చిత్ర టికెట్ ధరల పెంపు వ్యవహారం తెలంగాణ హైకోర్టుకు చేరింది. సినిమాకు ప్రత్యేకంగా టికెట్ ధరలు పెంచుకునేందుకు ప్రభుత్వం అనుమతి ఇవ్వడంపై దాఖలైన కోర్టు ధిక్కరణ పిటిషన్‌ను బుధవారం న్యాయస్థానం విచారించింది. ఈ సందర్భంగా ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు ప్రాథమికంగా చట్టవిరుద్ధంగా కనిపిస్తున్నాయని హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. సినిమా విడుదల సందర్భంగా పది రోజుల పాటు టికెట్ ధరలను పెంచుకునేందుకు అనుమతిస్తూ హోంశాఖ ఈ నెల రెండో తేదీన ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఈ నిర్ణయం ఇప్పటికే అమల్లో ఉన్న నిబంధనలకు, గతంలో న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలకు విరుద్ధమని పేర్కొంటూ పిటిషన్ దాఖలైంది.
పిటిషనర్ తరపున వాదనలు వినిపించిన న్యాయవాది, హోంశాఖ అధికారులు న్యాయస్థానం ఆదేశాలను ఉద్దేశపూర్వకంగానే పట్టించుకోలేదని ఆరోపించారు. టికెట్ ధరల పెంపు విషయంలో స్పష్టమైన మార్గదర్శకాలు ఉన్నప్పటికీ వాటిని విస్మరించి

మిగతా




# మోదీ నాయకత్వం దేశానికి దిశానిర్దేశం

- సుదీర్ఘ సేవలకు అభినందనలు
- అభివృద్ధి ఫలాలు ప్రజలకు
- తెలంగాణకు కేంద్రం అండ

హైదరాబాద్, జూన్ 10 (తెలంగాణ ముచ్చట్లు): దేశంలో అత్యధిక కాలం ఎన్నికైన ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ చరిత్ర సృష్టించడం దేశ ప్రజలందరికీ గర్వకారణమని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు అన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో కేంద్ర ప్రభుత్వ పన్నెండు సంవత్సరాల పాలనలో సాధించిన విజయాలను వివరించారు. గత 4,399 రోజులుగా నిరంతరాయంగా దేశ సేవలో నిమగ్నమైన నరేంద్ర మోదీ ప్రజల సంక్షేమాన్ని పరమావధిగా

మిగతా 2లో






# భవిష్యత్ నగరానికి శుభారంభం

- ఫ్యూచర్ సిటీ కార్యాలయ ప్రారంభం
- మాస్టర్ ప్లాన్ పనులకు శ్రీకారం
- అభివృద్ధి దిశగా మరో అడుగు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్, జూన్ 10 (తెలంగాణ ముచ్చట్లు): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భారత్ ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టుకు కీలక ముందడుగు పడింది. రికార్డు సమయంలో నిర్మాణం పూర్తి చేసుకున్న భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధి ప్రాధికార సంస్థ కార్యాలయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఇదే సందర్భంగా ఫ్యూచర్ సిటీకి సంబంధించిన ప్రత్యేక సమాచార వేదికను కూడా ఆవిష్కరించారు.

మిగతా 2లో

# కాళేశ్వరం పునరుద్ధరణకు గడువు ఖరారు

- సెప్టెంబరులో నమూనా రూపకల్పన పూర్తి
- ఏడాది జూన్ నాటికి మేడిగడ్డ సిద్ధం
- భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్, జూన్ 10 (తెలంగాణ ముచ్చట్లు): కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని దెబ్బతిన్న బ్యారేజీల పునరుద్ధరణ పనులను వేగవంతంగా పూర్తి చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణతో ముందుకు సాగుతోందని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. 2027 వేసవి నాటికి బ్యారేజీలను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు.

మిగతా 2లో



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# భవిష్యత్ నగరానికి శుభారంభం

(మొదటి పేజీ తరువాయి)

ఈ కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



ప్రారంభోత్సవం అనంతరం ముఖ్యమంత్రి మంత్రులు, అధికారులతో కలిసి కార్యాలయాన్ని పరిశీలించారు. ఫ్యూచర్ సిటీ పరిధిలో అభివృద్ధి ప్రణాళికల రూపకల్పన కోసం ఎంపికైన సలహా సంస్థ ప్రతినిధులకు అధికారిక అనుమతి పత్రాలను అందజేశారు. నగర అభివృద్ధి పనులను శాస్త్రీయంగా, ప్రణాళికాబద్ధంగా ముందుకు తీసుకెళ్లేందుకు ఈ చర్యలు కీలకమని అధికారులు తెలిపారు. ఫ్యూచర్ సిటీ ప్రాంతానికి సంబంధించిన సమగ్ర అభివృద్ధి ప్రణాళిక రూపొందించే ప్రక్రియకు కూడా ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారు. నగర విస్తరణ, మౌలిక వసతుల కల్పన, పారిశ్రామిక అభివృద్ధి, ఉపాధి అవకాశాల పెంపు వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తూ ప్రణాళికలు రూపొందించనున్నట్లు వెల్లడించారు.

ఈ సందర్భంగా ఫ్యూచర్ సిటీ పరిధిలోకి మరికొన్ని గ్రామాలను చేర్చే నిర్ణయానికి ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారు. సంబంధిత పత్రాలపై సంతకాలు చేసి ప్రాంతీయ అభివృద్ధికి మార్గం సుగమం చేశారు. దీంతో భవిష్యత్ నగర నిర్మాణానికి అవసరమైన భౌగోళిక విస్తరణకు అవకాశం లభించనుంది. భారత్ ఫ్యూచర్ సిటీ తెలంగాణ అభివృద్ధి దిశలో కీలక మైలురాయిగా నిలుస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. ఆధునిక సాంకేతికత, ప్రపంచ స్థాయి మౌలిక వసతులు, పర్యావరణహిత ప్రణాళికలతో ఈ నగరాన్ని రూపొందించనున్నట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రాన్ని అంతర్జాతీయ పెట్టుబడుల కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం వేగంగా ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.

# కాళేశ్వరం పునరుద్ధరణకు గడువు ఖరారు

(మొదటి పేజీ తరువాయి)

పథకం పరిధిలో జరుగుతున్న సాంకేతిక పరిశోధనలు, పరీక్షలు, పునరుద్ధరణ ప్రణాళికల పురోగతిని సమీక్షించిన అనంతరం మంత్రి మాట్లాడుతూ, ప్రస్తుతం కొనసాగుతున్న జలవిజ్ఞాన అధ్యయనాలు, భూగర్భ పరిశోధనలు, సాంకేతిక పరీక్షలు వేగంగా సాగుతున్నాయని చెప్పారు. మిగిలిన పరిశోధనలు జూన్ చివరి నాటికి లేదా జూలై మొదటి వారంలో పూర్తయ్యే అవకాశం ఉందన్నారు. అధ్యయనాల ఆధారంగా రూపొందించే పునరుద్ధరణ నమూనాలను కేంద్ర జల సంఘం, జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థకు పంపి అనుమతులు తీసుకుంటామని తెలిపారు. వర్షాకాలం ముగిసిన తర్వాత అక్టోబర్, నవంబర్ లేదా డిసెంబర్ ప్రారంభంలో పునరుద్ధరణ పనులు ప్రారంభమయ్యే అవకాశముందని వెల్లడించారు. ప్రభుత్వం ఈ అంశాన్ని రాజకీయ కోణంలో చూడడం లేదని మంత్రి స్పష్టం చేశారు.



గతంలో జరిగిన సాంకేతిక లోపాలు, నిర్మాణపరమైన తప్పిదాల కారణంగానే సమస్యలు తలెత్తాయని పేర్కొన్నారు. ప్రస్తుతం భద్రత, బాధ్యత, నాణ్యతకు ప్రాధాన్యం ఇస్తూ పనులు చేపడుతున్నామని చెప్పారు. కాళేశ్వరం పథక వ్యయం గతంలో భారీగా పెరిగిందని, లక్ష కోట్ల రూపాయలకు పైగా ఖర్చు అయినప్పటికీ బ్యారేజీలు ఆశించిన విధంగా వినియోగంలోకి రాలేదని విమర్శించారు. 2023 చివరి నుంచి మూడు బ్యారేజీలు పూర్తిస్థాయిలో ఉపయోగంలో లేవని గుర్తు చేశారు. గత ప్రభుత్వ హయాంలోనే బ్యారేజీలకు నష్టం జరిగిందని అన్నారు.

పునరుద్ధరణ పనుల కోసం అంతర్జాతీయ స్థాయి సాంకేతిక సంస్థలు, ప్రముఖ విద్యాసంస్థల నిపుణులను నియమించినట్లు తెలిపారు. భూగర్భ పరిశోధనలు, నిర్మాణ బలంపై పరీక్షలు దాదాపు పూర్తయ్యాయని వెల్లడించారు. జాతీయ, అంతర్జాతీయ నిపుణుల సూచనల మేరకు భవిష్యత్ తరాలకు సురక్షితంగా ఉండే విధంగా బ్యారేజీలను పునర్నిర్మిస్తామని చెప్పారు. జూలై నాటికి పరిశోధనలు పూర్తి చేసి, వర్షాకాలం అనంతరం నమూనాలను ఖరారు చేసి, ఈ ఏడాది చివర్లో పనులు ప్రారంభించి 2027 వేసవి నాటికి మేడిగడ్డ సహా అన్ని బ్యారేజీలను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రాజెక్టును తిరిగి సురక్షిత మార్గంలో నిలబెడతామని పేర్కొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లపై జూపల్లి సమీక్ష

- పెండింగ్ పనులపై ఆరా
- పేదల ఇళ్లకు ప్రాధాన్యం
- పదిహేను రోజుల్లో ప్రారంభం

**కొల్లాపూర్, జూన్ 10 (తెలంగాణ ముచ్చట్లు):** కొల్లాపూర్ నియోజకవర్గంలో అమలవుతున్న ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమంపై రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు పెంట్లవెల్లిలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. మొదటి విడతలో మంజూరైన ఇళ్ల నిర్మాణ పనుల పురోగతిని పరిశీలిస్తూ ఇంకా ప్రారంభం కాని ఇళ్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పేదల జీవితాల్లో మార్పు తీసుకువచ్చే కార్యక్రమంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రభుత్వం భావిస్తోందని ఆయన స్పష్టం చేశారు. నియోజకవర్గంలో తొలి విడత కింద మంజూరైన మూడు వేల ఐదు వందల ఇళ్లలో ఇంకా ప్రారంభం కాని నిర్మాణాలపై మంత్రి ఆరా తీశారు. పెండింగ్‌లో ఉన్న ప్రతి ఇంటి నిర్మాణం వచ్చే పదిహేను రోజుల్లోపు ప్రారంభం కావాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. లబ్ధిదారులు ముందుకు రాని పరిస్థితుల్లో ఆ ఇళ్లను అవసరమున్న ఇతర గ్రామాలకు కేటాయించే పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు. గ్రామాల్లో మంజూరైన ప్రతి ఇంటి నిర్మాణం ప్రారంభమయ్యేలా ప్రజాప్రతినిధులు, గ్రామ నాయకులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని మంత్రి సూచించారు. పథకం లక్ష్యం పూర్తిస్థాయిలో నెరవేరాలంటే ప్రతి అర్హ కుటుంబం ఇల్లు నిర్మించుకునేలా సహకరించాలని కోరారు. పేదలకు సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు.

మూడో స్థాయి జాబితా కారణంగా చెల్లింపులు నిలిచిపోయిన యాభై ఏడు మంది లబ్ధిదారుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు మంత్రి వెల్లడించారు. ఈ సమస్య త్వరలోనే పరిష్కారం అవుతుందని చెప్పారు. పొరపాటున ఆ జాబితాలో చేరిన అర్హులైన పేదలకు న్యాయం చేసేందుకు ప్రత్యేక ధ్రువీకరణ విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తున్నట్లు తెలిపారు. ధ్రువీకరణ అధికారుల ద్వారా గ్రామస్థాయిలో పరిశీలనలు నిర్వహించి అర్హులైన లబ్ధిదారులను సాధారణ జాబితాలో చేర్చే ప్రక్రియ చేపట్టాలని అధికారులకు సూచించారు. అర్హులైన ఒక్క పేద కుటుంబం కూడా నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించడంపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. మంజూరు అయినప్పటికీ ఆర్థిక ఇబ్బందుల వల్ల ఇల్లు నిర్మించుకోలేని అత్యంత పేద కుటుంబాల కోసం ప్రత్యేక కార్యాచరణను పరిశీలిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ప్రత్యేక సంస్థల ద్వారా సుమారు ఐదు లక్షల రూపాయల వ్యయంతో ఇళ్ల నిర్మాణం చేపట్టే విధానంపై ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు చెప్పారు. రెండో విడతలో మంజూరైన రెండు వేల ఇళ్లలో గుడిసెల్లో నివసించే కుటుంబాలకు మొదటి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు వెల్లడించారు.







# భారతీరాజా మృతిపై సీఎం దిగ్భ్రాంతి

(మొదటి పేజీ తరువాయి)

భారతీరాజా మరణంతో ఒక గొప్ప సృజనకర్తను దేశం కోల్పోయిందని ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. కళాత్మక విలువలు, సామాజిక బాధ్యత, సృజనాత్మకత కలగలిపిన ఆయన చిత్రాలు ఎప్పటికీ చిరస్మరణీయంగా నిలుస్తాయని పేర్కొన్నారు. చిత్రసీమ అభివృద్ధికి ఆయన చేసిన సేవలు తరతరాలకు గుర్తుండిపోతాయని అన్నారు. ఈ విషాద సమయంలో భారతీరాజా కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు, అభిమానులకు ముఖ్యమంత్రి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వారి కుటుంబానికి మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. భారతీయ చలన చిత్ర చరిత్రలో భారతీరాజా పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.



# 'పెద్ది' టికెట్ ధరలపై హైకోర్టు ప్రశ్నలు

(మొదటి పేజీ తరువాయి)

ఉత్తర్వులు జారీ చేశారని వాదించారు. వాదనలు విన్న హైకోర్టు, టికెట్ ధరల నిర్ణయంలో ఇప్పటికే అమల్లో ఉన్న నిబంధనలు, మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని ప్రభుత్వానికి సూచించింది. సినిమా రంగానికి ప్రత్యేక సడలింపులు ఇచ్చే సమయంలో చట్టపరమైన అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది.

ప్రభుత్వం తరపు న్యాయవాది స్పందిస్తూ, సంబంధిత శాఖల నుంచి పూర్తి వివరాలు సేకరించడానికి కొంత సమయం అవసరమని కోర్టును కోరారు. దీనిని పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం తదుపరి విచారణను ఈ నెల పదిహేనో తేదీకి వాయిదా వేసింది. భారీ వ్యయంతో తెరకెక్కే చిత్రాలకు టికెట్ ధరల పెంపు అంశం ఇటీవలి కాలంలో తరచూ వివాదాలకు దారితీస్తోంది. ప్రేక్షకులపై అదనపు భారం పడుతోందన్న విమర్శలతో పాటు, ప్రత్యేక అనుమతులపై న్యాయపరమైన సవాళ్లు కూడా ఎదురవుతున్నాయి. 'పెద్ది' చిత్రం టికెట్ ధరల వ్యవహారం ఇప్పుడు హైకోర్టు పరిశీలనలో ఉండటంతో తదుపరి విచారణపై సినీ వర్గాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి.



# మోదీ నాయకత్వం దేశానికి దిశానిర్దేశం

(మొదటి పేజీ తరువాయి)

చేసుకుని పాలన సాగిస్తున్నారని రామచందర్ రావు పేర్కొన్నారు. ప్రతి పౌరుడి అభ్యున్నతే లక్ష్యంగా సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. దేశంలో మౌలిక వసతుల అభివృద్ధి, జాతీయ భద్రత బలోపేతం, ఆర్థిక ప్రగతి, సంక్షేమ పథకాల అమలులో కేంద్ర ప్రభుత్వం విశేష ఫలితాలు సాధించిందన్నారు. రహదారులు, రైల్వేలు, విమానాశ్రయాలు, డిజిటల్ సేవల విస్తరణ ద్వారా దేశం వేగంగా అభివృద్ధి పథంలో పయనిస్తోందని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం కూడా కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా గణనీయమైన ప్రయోజనాలు పొందిందని ఆయన పేర్కొన్నారు. మౌలిక సదుపాయాల కల్పన, పారిశ్రామికాభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, ఉపాధి అవకాశాల పెంపులో కేంద్రం అందించిన సహకారం కీలకమని వివరించారు. గత పన్నెండు సంవత్సరాల పాలన ప్రజల విశ్వాసం, అభివృద్ధి, సంక్షేమానికి ప్రతీకగా నిలిచిందని రామచందర్ రావు అన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ దేశాన్ని మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. భారతదేశాన్ని ప్రపంచంలో అగ్రగామి దేశంగా నిలబెట్టే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి ఫలాలు ప్రతి ఇంటికి చేరేలా కృషి కొనసాగుతుందని రామచందర్ రావు వెల్లడించారు.


## రైతు సేవలకు పెద్దపీట.. జమ్మికుంట మార్కెట్ కమిటీ సమావేశంలో నిర్ణయాలు



- **ఇల్లంతకుంట, వీణవంకలో ఉప మార్కెట్ యార్డుల నిర్మాణం**

**జమ్మికుంట టౌన్ జూన్ 10 (తెలంగాణ ముచ్చట్లు):** కరీంనగర్ జిల్లా జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో బుధవారం పాలకవర్గ సాధారణ సమావేశం నిర్వహించారు. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ శ్రీమతి పుల్లూరి స్వప్న-సదానందం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ముందుగా తెలంగాణ రాష్ట్ర గీతాన్ని ఆలపించారు. అనంతరం పలు కీలక అంశాలపై చర్చించి తీర్మానాలు చేశారు. మార్చి-2026, ఏప్రిల్-2026, మే-2026 నెలల ఆదాయ, వ్యయాల వివరాలను సమీక్షించారు. అలాగే ఇల్లంతకుంట, వీణవంక మండలాల రైతుల సౌకర్యార్థం ఆయా మండల కేంద్రాల్లో అన్ని వసతులతో ఉప మార్కెట్ యార్డుల నిర్మాణం చేపట్టడంతో పాటు సిమెంట్ కాంక్రీట్ రహదారులు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో మార్కెట్ కార్యదర్శి ఎన్. రాజా, ఉపాధ్యక్షుడు ఎర్రం సతీష్‌రెడ్డి, సభ్యులు శ్రీపతి రెడ్డి, సునీల్, సతీష్, రాజేశ్వరరావు, సదానందం, సురేష్, దీక్షిత్, శ్రీనివాస్ రెడ్డి, రషీద్ పాషా, తిరుపతి, శ్యామ్ కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు. మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ కూడా సమావేశానికి హాజరయ్యారు.

## జమ్మికుంట రెవెన్యూ కార్యాలయంలో అక్రమాల ఆరోపణలు.. ఆర్ఐపై విచారణకు డిమాండ్




- **ధ్రువపత్రాలు, భూ వ్యవహారాల్లో అక్రమాలు జరుగుతున్నాయంటూ ప్రజల ఆరోపణలు.**

**జమ్మికుంట టౌన్ జూన్ 10 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట తహసిల్దార్ కార్యాలయం అవినీతికి అడ్డాగా మారిందని పలువురు చర్చించుకుంటున్నారు. పూర్తి వివరాల్లోకి వెళితే స్థానిక తాసిల్దార్ కార్యాలయంలో గత రెండు సంవత్సరాలుగా ఆర్ఐగా విధులు నిర్వహిస్తున్న సదరు ఉద్యోగి గత కొన్ని సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న భూములను ఎలాంటి ఎంక్వయిరీ లేకుండా తాసిల్దార్ కు రిపోర్టు అందజేసి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నట్లు పట్టణంలో జోరుగా చర్చ జరుగుతుంది. రేషన్ కార్డుల జారీలో కూడా భారీ మొత్తంలో నగదు వసూలు చేసినట్టు ఆరోపణలు ఉన్నాయి. విద్యార్థులు తీసుకునే కులం సర్టిఫికెట్, ఆదాయ సర్టిఫికెట్, స్థానిక నివాసం సర్టిఫికెట్ జారీకి కూడా డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు పలువురు ప్రజలు విద్యార్థులు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. రెండు సంవత్సరాలుగా తాసిల్దార్ కార్యాలయంలో అనేక అవినీతికి ఆరోపణలు ఎదుర్కొంటున్న కానీ సదరు ఉద్యోగిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు చర్చించుకుంటున్నారు.. కార్యాలయం సమయంలో ఆఫీస్కు రాకుండా 11:30,12:00 గంటల సమయంలో ఆఫీసుకు వచ్చి విధులు నిర్వహిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. స్థానిక మున్సిపల్ ఎలక్షన్ లో కూడా ఓసి కి బీసీ సర్టిఫికెట్ మంజూరు చేశారు. ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కి కూడా డబ్బులు తీసుకొని ఇద్దరు భార్యలు ఉంటే తప్పుడు రిపోర్ట్ అందజేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇలాంటి అధికారిపై జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి ప్రజలకు విద్యార్థులకు ఇబ్బందులు కలగ చేస్తున్న ఆర్ఐపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.

## మోజర్లలో గ్రామసభ - బడిబాటకు విశేష స్పందన




**పెద్దమందడి,జూన్10(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలంలోని మోజర్ల గ్రామంలో బుధవారం గ్రామసభతో పాటు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు.గ్రామంలో నెలకొన్న సమస్యలపై వివిధ శాఖల అధికారులు సమీక్ష నిర్వహించి ప్రజల అభిప్రాయాలు తెలుసుకున్నారు.ఈ కార్యక్రమానికి సర్పంచ్ చంద్రశేఖర్ అధ్యక్షత వహించగా, ఉప సర్పంచ్ రాములు, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.బడిబాట కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు యుగంధర్ మాట్లాడుతూ.. మోజర్ల ప్రాథమిక పాఠశాలకు పూర్వ ప్రాథమిక విద్యా కేంద్రం మంజూరైందని, నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థులు చేరవచ్చని తెలిపారు.జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ఎస్. వరప్రసాద్ రావు మాట్లాడుతూ..గత రెండేళ్లుగా పదో తరగతిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా విద్య అందిస్తున్నాయని పేర్కొన్నారు. విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, గుడ్లు, రాగిజావా వంటి పౌష్టికాహారం అందిస్తున్నట్లు వివరించారు.ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నందున బడి ఈడు గల పిల్లలందరూ ప్రభుత్వ పాఠశాలల్లోనే చేరాలని వారు పిలుపునిచ్చారు.కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు, ఉపాధ్యాయులు, మహిళా సంఘాల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# కెసిఆర్ ను తిరిగి అధికారంలోకి తీసుకొద్దాం

- **బి ఆర్ ఎస్ పార్టీని బలోపేతం చేద్దాం**
- **మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్**



**కాజీపేట్ జూన్ 10 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రంలో అధికారాల్లోకి తిరిగి కేసీఆర్ ను ప్రతి ఒక్కరూ సైనికుల పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ పిలుపునిచ్చారు కాజిపేట్ బాపూజీ నగర్ లోని పోచమ్మ గుడి కమ్యూనిటీ హాల్లో ఏర్పాటు చేసిన 47, 62, 63 పార్టీ బూతు లెవెల్ ఏజెంట్ ల సమావేశాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వినయ్ భాస్కర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలకు సేవ చేసేందుకు ప్రజల తరపున పోరాడేందుకు పార్టీ శ్రేణులు సంసిద్ధంగా అవుదామని ప్రతి ఒక్కరూ ప్రతిజ్ఞ చేశారు కాజీపేటలో రోడ్లు డ్రైనేజీ కమ్యూనిటీ హాల్ స్మశానవాటికలు పలుభవనాలను మార్కెట్ ఐటిఐ కళాశాల రైల్వే కోచ్ ఫ్యాక్టరీ సాధన కోసం ఉద్యమం సంక్షేమ పలాలు వేలాదిమందికి అందడం జరిగిందన్నారు గత ప్రభుత్వం మాయాంలో చేసిన అభివృద్ధిని గడప గడపకు తిరుగుతూ ప్రజలకు తెలియజేయాలన్నారు ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో పార్టీ శ్రేణులు సమర్థవంతంగా పాల్గొన్నారు టిఆర్ఎస్ పార్టీపై కొందరు చేస్తున్న ప్రచారాన్ని తిప్పి కొట్టాలని ఆయన కోరారు కేసీఆర్ పదవేల బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలను కాంగ్రెస్ రెండున్నర ఏళ్ల పాలనకు మధ్య వ్యత్యాసాన్ని ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు ఆయన సూచించారు. కాజీపేట లోనే వైయస్సార్ నగర్ లో ప్రజలు వేసుకున్న గుడిసెలను రాజకీయ అండదండలతో కొందరు తొలగించాలని కుట్రలు పన్నుతున్నారని ఆ గుడిసె ప్రజలు లకు అండగా ఉండి వారి తరపున పోరాటానికి సిద్ధమవ్వాలన్నారు ప్రజల తరపున పోరాడితే ప్రభుత్వం కేసులు పెడుతున్నానని ఆరోపించారు తెలంగాణ ఉద్యమ సమయంలో ఎన్నో కేసులు పెట్టారని కేసులకు భయపడమని ఆయన హెచ్చరించారు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు పేదలకు పంచితే మేము వ్యతిరేకం కాదని కానీ కొన్ని అవకతవకలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కట్టించింది కేసీఆర్ టిఆర్ఎస్ ప్రభుత్వం అని ఆయన గుర్తు చేశారు డివిజన్లోని రాష్ట్ర జిల్లా నగర తదితర స్థాయిలో పార్టీ పదవులు అనుభవించిన శ్రేణులు మాజీ ప్రజా ప్రతినిధులు బూత్ స్థాయిలో కమిటీ సభ్యులుగా ఉండే పార్టీని బలోపేతం చేయాలని ఆయన కోరారు సోషల్ మీడియాలో మన వానిని బలంక వినిపిద్దామన్నారు పార్టీ బలోపేతానికి కష్టపడిన ప్రతి ఒక్కరిని పార్టీ గుర్తు పెట్టుకుంటుందని పార్టీలో వారికి భవిష్యత్తు ఉంటుందని వివరించారు కాజీపేట లోని వివిధ పార్టీలకు చెందిన పలువురు యువకులు 47 వ డివిజన్ అధ్యక్షుడు దువ్వ కనకరాజు ఆధ్వర్యంలో టిఆర్ఎస్ పార్టీలో చేరారు వారికి అనుమకొండ బి ఆర్ ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినోద్ భాస్కర్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు పార్టీలో చేరిన ప్రతి ఒక్కరిని కంటికి రెప్పలా కాపాడుకుంటామన్నారు ఈ కార్యక్రమంలో మాజీ కూడా చైర్మన్ మర్రి యాదవ రెడ్డి, మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్, సంకు నర్సింగరావు, తండమల్ల రేవతి వేణు, డివిజన్లో ఇన్చార్జులు అధ్యక్షులు సాదినేని సుధాకర్ పోలపల్లి రామ్మూర్తి అశోక్ రంజిత్ కుమార్ లతోపాటు తదితరులు పాల్గొన్నారు.







# ప్రజల భాగస్వామ్యంతోనే పట్టణాభివృద్ధి.. వార్డు సభల్లో చైర్మన్ సందేశం

- **1, 2, 3, 8వ వార్డు సభలకు హాజరైన మున్సిపల్ చైర్మన్ దిలీప్**

**జమ్మికుంట టౌన్ జూన్ 10 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో స్థానిక పత్తిదారుల సంఘం భవనంలో 1, 2, 3, 8వ వార్డులకు సంబంధించిన వార్డు సభలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో విలీనం అయిన ధర్మారం, రామన్నపల్లి గ్రామాల్లో రానున్న వర్షాకాలంలో వరద నీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. "అమ్మ మనకు జన్మనిస్తే, మొక్కలు పునర్జన్మనిస్తాయి" అని పేర్కొన్నారు. సభలో ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలు-2026, "జల్ సంచయ్ - జల్ భాగీదారి" కార్యక్రమం కింద వర్షపు నీటి సంరక్షణ నిర్మాణాలు, డ్రైనేజీల పూడికతీత, వర్షాకాల సన్నద్ధత కార్యాచరణ ప్రణాళిక, తాగునీటి సరఫరా, నీటి నిల్వల నివారణ, పారిశుధ్యం, రోడ్ల నిర్వహణ, వీధి దీపాలు, మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణ, ప్రజల ఫిర్యాదుల పరిష్కారం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహార పదార్థాలు పిల్లల ఆరోగ్యవృద్ధికి, గర్భిణులు మరియు బాలింతల సంక్షేమానికి ఎంతగానో ఉపయోగపడుతున్నాయని వివరించారు. విద్యుత్ శాఖ సహాయ ఇంజనీర్ మాట్లాడుతూ ప్రతి వార్డుకు లైన్‌మన్, జేఎల్ఎం సిబ్బంది అందుబాటులో ఉండి విద్యుత్ సమస్యల పరిష్కారానికి సేవలందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి, కౌన్సిలర్లు పోలు దివ్యబిక్షపతి, పోల్నేని శిల్పవేణుగోపాల్, కొలకని రాజకుమారి రాజు, కొలుగురి సురేష్, రమేష్, వంశీ, శ్రీకాంత్, వార్డు అధికారులు, సీఎల్ఆర్పీలు, ఆర్పీలు, విద్యుత్ శాఖ అధికారులు, ఐసీడీఎస్ సిబ్బంది, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ఏఎల్ఎంలు, జేఎల్ఎంలు, వార్డుల పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

# ముల్కనూర్‌లో గ్రామ సభ నిర్వహణ – సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ




**భీమదేవరపల్లి, జూన్ 10(తెలంగాణ ముచ్చట్లు):** ముల్కనూర్ గ్రామంలో సర్పంచ్ జాలి ప్రమోద్ రెడ్డి మరియు గ్రామ కార్యదర్శి ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ గ్రామ సభకు మండల ఎంపీడీవో, ఎంఈఓ, వ్యవసాయ శాఖ ఏఓ, ముల్కనూర్ సబ్ ఇన్‌స్పెక్టర్, మోడల్ స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు, ప్రభుత్వ బాలికల ప్రధాన ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, వార్డు సభ్యులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

గ్రామాభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, విద్య, వ్యవసాయం, గ్రామ సమస్యలు తదితర అంశాలపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పించి, వారి సూచనలు స్వీకరించారు.

అనంతరం గ్రామ సర్పంచ్ జాలి ప్రమోద్ రెడ్డి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అశోక్ ముఖర్జీ, ఆదరి రవి, సుదర్శన్ రెడ్డి, కొలుగూరి రాజు, చిటుకూరి అనిల్, గుడికందుల రాజు, మాడుగుల గోపి, చిటుకూరి నితిన్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌లో భారీ చేరికలు.. మాజీ ప్రజాప్రతినిధులు, యువ నాయకులు గులాబీ గూటికి!

**హుజూరాబాద్, జూన్ 10 (తెలంగాణ ముచ్చట్లు):** రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్న వేళ కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి మరోసారి ఊపు వచ్చింది. మాజీ ప్రజాప్రతినిధులు, యువ నాయకులు, వివిధ గ్రామాల కీలక కార్యకర్తలు పెద్ద ఎత్తున బీఆర్ఎస్ పార్టీలో చేరి గులాబీ కండువాలు కప్పుకోవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. హుజూరాబాద్ నియోజకవర్గంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు, గ్రామస్థాయి నాయకులు, యువకులు పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీ జిల్లా నాయకులు వారికి గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన సేవలను గుర్తించి ప్రజలు తిరిగి పార్టీ వైపు వస్తున్నారని పేర్కొన్నారు. గ్రామాల్లో పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని, రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ మరింత శక్తివంతంగా ఎదుగుతుందని ధీమా వ్యక్తం చేశారు. రాజపల్లి సర్పంచ్ మల్లారెడ్డి, జాపాక సింగిల్ విండో చైర్మన్ అలుమల్ల శ్యాంసుందర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శేగిరం అయిలయ్యతో పాటు పలువురు గ్రామాల నాయకులు, యువజన ప్రతినిధులు, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు. బీఆర్ఎస్ పార్టీ చేపడుతున్న ప్రజా ఉద్యమాలు, సభ్యత్వ నమోదు కార్యక్రమాలు ప్రజల్లో మంచి ఆదరణ పొందుతున్నాయని వారు తెలిపారు. పార్టీని గ్రామ స్థాయి నుంచి మరింత బలోపేతం చేసి రానున్న ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని నాయకులు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. భారీ సంఖ్యలో కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరడం నియోజకవర్గ రాజకీయాల్లో కొత్త ఉత్సాహాన్ని నింపిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# వార్డు సభల ద్వారా ప్రజలకు చేరువైన చైర్‌పర్సన్ సుహాసిని



**హుజూరాబాద్, జూన్ 10 (తెలంగాణ ముచ్చట్లు):** హుజూరాబాద్ పట్టణ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి రొంటాల సుహాసిని మనోజ్ రావు పలు వార్డుల్లో నిర్వహించిన వార్డు సభల్లో పాల్గొని ప్రజలకు మరింత చేరువయ్యారు. పట్టణంలోని 7, 8, 9, 10, 11 వార్డుల్లో నిర్వహించిన వార్డు సభల్లో ఆమె పాల్గొని స్థానిక ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా వార్డుల ప్రజలు తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ, వీధి దీపాల ఏర్పాటు, డ్రైనేజీ వ్యవస్థ, రోడ్ల మరమ్మతులు, మురుగునీటి సమస్యలు తదితర అంశాలను చైర్‌పర్సన్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలు వినిపించిన ప్రతి సమస్యను శ్రద్ధగా విన్న సుహాసిని మనోజ్ రావు, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజలకు మెరుగైన మున్సిపల్ సేవలు అందించడం తమ ప్రాధాన్యమని, వార్డుల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి దశలవారీగా పరిష్కరిస్తామని ఆమె పేర్కొన్నారు. ప్రజలతో ప్రత్యక్షంగా మాట్లాడటం ద్వారా సమస్యలపై స్పష్టమైన అవగాహన ఏర్పడుతుందని, వార్డు సభలు ప్రజా పాలనలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. అలాగే పట్టణ అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని, ప్రతి పౌరుడు పారిశుద్ధ్యం, పర్యావరణ పరిరక్షణ, ప్రజా ఆస్తుల సంరక్షణలో తన వంతు బాధ్యత నిర్వర్తించాలని చైర్‌పర్సన్ పిలుపునిచ్చారు. ప్రజల సూచనలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని అభివృద్ధి కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్, సంబంధిత వార్డుల కౌన్సిలర్లు, అంగన్‌వాడీ సూపర్వైజర్, ఆరోగ్య శాఖ అధికారులు, మున్సిపల్ సిబ్బంది, వార్డు ఆఫీసర్లు, ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు. వార్డు సభలు ప్రజా సమస్యల పరిష్కారానికి వేదికగా మారడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

# గ్రామంలోకి ఎలుగుబంటి ఎంట్రీ అటవీ శాఖ చర్యల కోసం ఎదురుచూపులు



**ఎల్కతుర్తి, జూన్ 10 (తెలంగాణ ముచ్చట్లు):** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలోని సూరారం గ్రామంలో ఎలుగుబంటి సంచారం స్థానిక ప్రజలను భయాందోళనలకు గురిచేస్తోంది. మంగళవారం రాత్రి గ్రామంలోని ముస్లిం కాలనీలో ఎలుగుబంటి తిరుగాడిన ఘటనతో గ్రామంలో కలకలం నెలకొంది. ఎలుగుబంటి గ్రామంలోకి రావడంతో కాలనీ వాసులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గ్రామస్తుల కథనం ప్రకారం, మూడు రోజుల క్రితం గ్రామ శివారులో వాకింగ్‌కు వెళ్లిన కొందరికి ఎలుగుబంటి కనిపించింది. దీంతో వారు భయంతో అక్కడి నుంచి పరుగులు తీశారు. ఆ ఘటన మరువకముందే మళ్లీ ముస్లిం కాలనీలో ఎలుగుబంటి సంచరిస్తూ కనిపించడంతో ప్రజలు మరింత అప్రమత్తమయ్యారు.

ఎలుగుబంటి సంచారం కారణంగా సాయంత్రం వేళల్లో ఇళ్ల బయటకు రావడానికి కూడా ప్రజలు భయపడుతున్నారు. ముఖ్యంగా చిన్నారులు, మహిళలు, వృద్ధులు బయటకు వెళ్లేందుకు జంకుతున్నారు. ఎలుగుబంటి ఎప్పుడు ఎటు నుంచి వస్తుందో తెలియక గ్రామంలో భయభ్రాంతుల వాతావరణం నెలకొంది.

ఈ విషయాన్ని గ్రామస్తులు స్థానిక ప్రజాప్రతినిధులు, ఎల్కతుర్తి పోలీసులకు, అటవీ శాఖ అధికారులకు తెలియజేశారు. గ్రామంలో సంచరిస్తున్న ఎలుగుబంటిని గుర్తించి సురక్షితంగా అటవీ ప్రాంతానికి తరలించాలని వారు కోరుతున్నారు. అటవీ శాఖ అధికారులు తక్షణమే స్పందించి ఎలుగుబంటి సంచారంపై నిఘా ఏర్పాటు చేసి, గ్రామస్తుల భద్రత కోసం అవసరమైన చర్యలు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. అలాగే గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని, రాత్రి వేళల్లో ఒంటరిగా బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. ఎలుగుబంటి బెడద నుంచి గ్రామస్తులకు ఉపశమనం కల్పించేందుకు అటవీ శాఖ త్వరితగతిన చర్యలు చేపట్టాలని సూరారం ప్రజలు ఎదురుచూస్తున్నారు.

# బడీ బాటతో విద్యార్థుల వేట ఇంటింటికీ చేరిన ఎంఈఓ సత్యనారాయణ సందేశం

**ఎల్కతుర్తి, జూన్ 10 (తెలంగాణ ముచ్చట్లు):**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంపే లక్ష్యంగా చేపట్టిన బడి బాట కార్యక్రమం ఎల్కతుర్తి మండలంలో జోరుగా కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా మండల విద్యాధికారి (ఎంఈఓ) చదువుల సత్యనారాయణ తిమ్మాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ తల్లిదండ్రులను కలిశారు.



ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న సౌకర్యాలు, నాణ్యమైన విద్య గురించి వివరించి తమ పిల్లలను సర్కార్ బడిలో చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా ప్రభుత్వ పాఠశాలలే ఉత్తమ వేదికలని ఎంఈఓ సత్యనారాయణ పేర్కొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులు చెల్లించి ఆర్థికంగా ఇబ్బందులు పడకూడదని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు క్రమశిక్షణ, విలువలతో కూడిన బోధన అందుతుందని తెలిపారు. విద్యార్థులకు ప్రభుత్వం ఉచిత నోటు పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలు, షూస్, బెల్టులు, మధ్యాహ్న భోజనం వంటి పలు సౌకర్యాలు కల్పిస్తోందని చెప్పారు. ప్రతి బడీడు పిల్లవాడు పాఠశాలలో చేరేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమిష్టిగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, సీఆర్పీ రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యాదాతకు విశిష్ట సన్మానం..

- డాక్టర్ పులిపాటి ప్రసాద్‌కు ఘన సన్మానం

**ఖమ్మం బ్యూరో, జూన్ 10(తెలంగాణ ముచ్చట్లు ):** విద్యా, సామాజిక, సేవా రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తూ వేలాది మందికి స్ఫూర్తిగా నిలిచిన ప్రముఖ విద్యావేత్త, పులిపాటి విద్యాసంస్థల అధినేత, ఖమ్మం పౌర సమితి అధ్యక్షులు డాక్టర్ పులిపాటి ప్రసాద్ గారికి ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా రెండోసారి నియమితులైన సందర్భంగా పులిపాటి నగర్2లోని పులిపాటి మినీ ఫంక్షన్ హాల్‌లో ఈ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది.



2008లో భారత మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ చేతుల మీదుగా వాగ్దేవి విద్యా పురస్కారం అందుకున్న డాక్టర్ పులిపాటి ప్రసాద్, పులిపాటి ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ నిరుపేదలకు విద్య, ఆర్థిక సహాయం, అన్నదాన సేవలు అందిస్తున్నారని పలువురు వక్తలు కొనియాడారు. సమాజంలో ఆపద్బాంధవుడిగా, విద్యాదాతగా ఆయన సాధించిన గుర్తింపు అభినందనీయమన్నారు.

రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమర్నాథ్ లక్ష్మీనారాయణ నాయకత్వంలో రాష్ట్ర ఉపాధ్యక్షులుగా తిరిగి బాధ్యతలు చేపట్టడం పట్ల హర్షం వ్యక్తం చేసిన ప్రముఖులు, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించి సమాజానికి మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా డాక్టర్ పులిపాటి ప్రసాద్ గారిని శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు.

కార్యక్రమంలో సిద్ధంశెట్టి శ్రీకాంత్, కోదుమూరు భద్రయ్య, కోదుమూరు జగన్నాథం, మాశెట్టి వరప్రసాద్, కొంకిమళ్ల మృత్యుంజయ గుప్తా, పాలవాయి వెంకటేశ్వర్లు, దాస శ్రీనివాసరావు, వజినేపల్లి చంద్రశేఖర్ గుప్తా, తేలుకుంట్ల ఓంకార్, వెల్లంపల్లి వెంకట సుబ్బారావు, విద్యాల విశ్వనాథ్ గుప్తా, కాజా వెంకటేశ్వరరావు, సుగ్గల శ్రీహరి, గోపాలరావు, తాడికొండ అరవింద్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి హాజరైన ప్రతి ఒక్కరికీ డాక్టర్ పులిపాటి ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు.

# అర్హులైన ప్రతి ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలి..

*జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్*

**ఖమ్మం బ్యూరో , జూన్ 10(తెలంగాణ ముచ్చట్లు ):** అర్హులైన ప్రతి ఓటరు డ్రాఫ్ట్ జాబితాలో ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ తెలిపారు.

బుధవారం కలెక్టరేట్ లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, మునిసిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య లతో కలిసి ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ సమీక్ష సమావేశం నిర్వహించారు.



ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ జిల్లాలో సుమారు 12 లక్షల మంది ఓటర్లు ఉండగా, ఇప్పటివరకు 10 లక్షల మంది వరకు ఓటర్ల మ్యాపింగ్ పూర్తయిందన్నారు. వివిధ కారణాల వల్ల మిగిలిన 20 శాతం ఓటర్ల మ్యాపింగ్ జరగలేదని తెలిపారు. ఎస్.ఐ.ఆర్. కార్యక్రమాన్ని అన్ని రాజకీయ పార్టీలు అత్యంత బాధ్యతగా తీసుకోవాలని, బీఎల్‌వోలు ఇంటింటికి వచ్చినప్పుడు ఓటర్లు సకాలంలో స్పందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలో ఒక్క అర్హుడైన ఓటరు కూడా ఓటు హక్కు కోల్పోకూడదనేదే జిల్లా యంత్రాంగం లక్ష్యమని స్పష్టం చేశారు.

మ్యాపింగ్ పూర్తయిన ప్రతి ఓటరు కూడా తప్పనిసరిగా ఎన్యూమరేషన్ ఫారం సమర్పించాలని, ఫారం సమర్పించని పక్షంలో వారి పేరు డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో ఉండదని స్పష్టం చేశారు. అనంతరం అభ్యంతరాలు నమోదు చేయాల్సిన పరిస్థితి ఏర్పడి సమస్యలు తలెత్తుతాయని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు డ్రాఫ్ట్ జాబితాలో ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రస్తుతం జిల్లాలో అనామలీలను గణనీయంగా తగ్గించగలిగామని, గతంలో 30 శాతం ఉన్న అనామలీలను ప్రస్తుతం 20 శాతానికి తగ్గించామని తెలిపారు. 80 శాతం మ్యాపింగ్ పూర్తయిన ఓటర్లలో సిస్టమ్ ద్వారా గుర్తించిన అనామలీలకు నోటీసులు జారీ చేసి పరిశీలన చేపడతామని చెప్పారు.

తండ్రికొడుకు సంబంధంగా మ్యాపింగ్ చేసిన ఇద్దరి మధ్య వయస్సు వ్యత్యాసం 15 సంవత్సరాల కంటే తక్కువగా ఉన్నా, తాత మనవడు సంబంధంగా నమోదు చేసిన వారి మధ్య తక్కువ వ్యత్యాసం ఉన్నా వాటిని అనామలీలుగా పరిగణించి నోటీసులు జారీ అవుతాయని తెలిపారు.

అనామలీల సమస్య పరిష్కారానికి పూర్తి ప్రక్రియను అనుసరించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఓటరు జాబితాలో గుర్తించిన లోపాలు గల ప్రతి అనామలీ ఓటరుకు నోటీసులు జారీ చేసి, వారి వివరణలు స్వీకరించి సవరణలు చేపట్టాల్సి ఉంటుందని చెప్పారు. మొత్తం ప్రక్రియను ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ ఆధారాలతో భద్రపరుస్తామని తెలిపారు. అనామలీలుగా గుర్తించిన ఓటర్ల వద్ద సంబంధిత పత్రాలు ఉన్నాయా లేదా అనే విషయాన్ని నిర్ధారించేందుకు జూలై 15 వరకు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) ఈ కార్యక్రమానికి సహకరించాలని కోరారు. ప్రతి రాజకీయ పార్టీ బూత్ స్థాయిలో బీఎల్ఏలను నియమించి కార్యక్రమాన్ని పర్యవేక్షించాలని సూచించారు.

పాత ఎస్ఎస్ఆర్ జాబితాలో ఉండి మ్యాపింగ్ కాని ఓటర్లు ఎన్నికల సంఘం గుర్తించిన 11 గుర్తింపు పత్రాల్లో ఏదో ఒకటి సమర్పించాలని, రేషన్ కార్డును గుర్తింపు పత్రంగా పరిగణించబోమని స్పష్టం చేశారు. మ్యాపింగ్ కాని ఓటర్ల ప్రస్తుత స్థితి, గ్రామంలోనే నివసిస్తున్నారా, జీవించి ఉన్నారా లేదా, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారా వంటి వివరాలను సేకరిస్తామని తెలిపారు. జనన తేదీలను కూడా పరిశీలిస్తామని చెప్పారు.

జూలై 1, 1987కు ముందు భారతదేశంలో జన్మించిన వారు తమ స్వీయ గుర్తింపు లేదా జనన పత్రాలు సమర్పిస్తే సరిపోతుందని, తల్లిదండ్రుల పత్రాలు అవసరం లేదన్నారు. జూలై 1, 1987 నుంచి డిసెంబర్ 2, 2004 మధ్య జన్మించిన వారు తమ పత్రాలతో పాటు తల్లి లేదా తండ్రిలో ఎవరి అయినా ఒకరి జనన లేదా గుర్తింపు పత్రం సమర్పించాలని తెలిపారు. డిసెంబర్ 2, 2004 తర్వాత జన్మించిన వారు తమ పత్రాలతో పాటు తల్లిదండ్రులిద్దరి పత్రాలు సమర్పించాల్సి ఉంటుందని వివరించారు. జూన్ 25 నుంచి జూలై 24 వరకు బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలు సేకరిస్తారని తెలిపారు. మ్యాపింగ్ కాని ఓటర్ల నుంచి ఫారాలతో పాటుగుర్తింపు పత్రాలు కూడా సేకరిస్తారని, అనామలీ ఓటర్ల సమస్యలను అవసరమైన పత్రాల ఆధారంగా పరిష్కరిస్తామని చెప్పారు.

జూలై 31, 2026న డ్రాఫ్ట్ ఎస్ఐఆర్ ఓటరు జాబితా విడుదల చేస్తామని తెలిపారు. ప్రతి ఓటరు తమ పేరు డ్రాఫ్ట్ జాబితాలో ఉందో లేదో పరిశీలించాలని సూచించారు. ఆగస్టు 30 వరకు అభ్యంతరాలు, ఫిర్యాదులు, కొత్త క్లెయిమ్‌లు స్వీకరిస్తామని చెప్పారు. సెప్టెంబర్ 28 నాటికి అన్ని అభ్యంతరాలు, క్లెయిమ్‌లను పరిష్కరించి అక్టోబర్ 1, 2026న తుది ఎస్ఐఆర్ ఓటరు జాబితాను విడుదల చేస్తామని తెలిపారు. జూన్ 25 నుంచి జూలై 24 వరకు బీఎల్‌వోలు ఇంటింటికి వచ్చినప్పుడు ఓటర్లు పూర్తి వివరాలతో ఎన్యూమరేషన్ ఫారాన్ని సమర్పించి తప్పనిసరిగా రసీదు తీసుకోవాలని సూచించారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి సంబంధించిన బీఎల్‌వో వివరాలను ప్రజలకు తెలిసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఆర్డీఓ శ్రీనివాస్, బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధులు బెల్లం వేణుగోపాల్, రమేష్, పి. నాగరాజు, బీజేపీ ప్రతినిధులు రాజేష్, వెంకటేశ్వర్ రావు, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు గోపాలరావు, సత్యనారాయణ, సిపిఎం డి.తిరుపతి, ఎన్.వీరబాబు, ఆప్ ప్రతినిధి పి.శ్రీనివాస్, టీడీపీ పాలడుగు టిఆర్ కృష్ణ ప్రసాద్, బిఎస్పి సిహెచ్ నాగేశ్వర రావు, ఎం.నాగేశ్వర రావు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# లంబాడీ అధికారులను లక్ష్యంగా చేసుకోవడం సరికాదు

- లంబాడీల ఐక్య వేదిక లైవ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు లావుడియా పల్లవి రాజు నాయక్

**హనుమకొండ,జూన్10(తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రంలో లంబాడీ సమాజానికి చెందిన అధికారులపై వరుసగా ఏసీబీ దాడులు, విచారణలు జరుగుతున్న తీరుపై గిరిజన సమాజంలో ఆందోళన నెలకొందని లంబాడీల ఐక్య వేదిక లైవ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, బీఆర్ఎస్ పార్టీ రెండో డివిజన్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు లావుడియా పల్లవి రాజు నాయక్ పేర్కొన్నారు. బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, ఇటీవల ఆర్అండ్‌బీ ఈఎన్‌సీ మోహన్ నాయక్‌పై జరిగిన ఏసీబీ చర్యల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. అవినీతికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడాన్ని ఎవరూ వ్యతిరేకించడం లేదని, అయితే చట్టం అందరికీ సమానంగా అమలవుతున్నదా అనే ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గిరిజనులు, ముఖ్యంగా లంబాడీ వర్గానికి చెందిన అధికారులు, నాయకుల పట్ల వివక్షపూరిత వైఖరి ప్రదర్శిస్తున్నదనే భావన సమాజంలో పెరుగుతోందని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమం నుంచి రాష్ట్ర అభివృద్ధి వరకు ప్రతి దశలో లంబాడీ సమాజం కీలక పాత్ర పోషించిందని, అలాంటి సమాజానికి తగిన రాజకీయ ప్రాధాన్యం, అధికార వ్యవస్థలో సముచిత గుర్తింపు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.

ప్రభుత్వంలో ఉన్న గిరిజన ప్రజాప్రతినిధులు, లంబాడీ నాయకులు ఈ అంశంపై స్పందించాలని, సమాజ ఆత్మగౌరవానికి సంబంధించిన అంశాలపై తమ వైఖరిని ప్రజలకు స్పష్టం చేయాలని కోరారు. చట్ట అమలు పేరుతో ఒక వర్గాన్ని మాత్రమే లక్ష్యంగా చేసుకున్నారనే భావన కలిగించే చర్యలు ప్రభుత్వ విశ్వసనీయతను దెబ్బతీస్తాయని అన్నారు. మోహన్ నాయక్ వ్యవహారంపై ప్రభుత్వం పునర్విమర్శ చేయాలని, గిరిజన ఉద్యోగులపై కక్షపూరిత ధోరణితో చర్యలు జరుగుతున్నాయనే ఆరోపణలకు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. లంబాడీ సమాజ హక్కులు, ఆత్మగౌరవం, రాజకీయ ప్రాతినిధ్యాన్ని విస్మరించే ధోరణి కొనసాగితే రాష్ట్రవ్యాప్తంగా ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు.

ఈ అంశంపై లంబాడీ సంఘాలు, ప్రజా ప్రతినిధులు, ఉద్యోగ సంఘాలు, విద్యార్థి, యువజన నాయకులతో విస్తృత స్థాయిలో చర్చలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ ప్రకటనపై హనుమకొండ జిల్లా అధ్యక్షుడు అజ్మీర వెంకటేష్, జిల్లా ఇన్‌చార్జి భూక్య మోహన్ నాయక్, మండల ఇన్‌చార్జి వాంకుడోత్ వినోద్ కుమార్ తదితరులు మద్దతు తెలిపారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నాం...

**రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వరరావు**



**ఖమ్మం బ్యూరో , జూన్ 10(తెలంగాణ ముచ్చట్లు ):**ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వర రావు అన్నారు.

బుధవారం ఖమ్మం నగరంలోని ఎఫ్‌సీఐ గోదాం నుంచి బైపాస్ రోడ్డు వరకు రూ.3 కోట్ల 5 లక్షల యూఐడీఎఫ్ నిధులతో చేపట్టిన బీటీ రోడ్డు, సీసీ డ్రైన్ నిర్మాణ పనులకు సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గా ప్రసాద్, ఖమ్మం మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500 గ్యాస్ సిలిండర్, సన్నబియ్యం పంపిణీ, కొత్త రేషన్ కార్డులు, పేద విద్యార్థుల కోసం యంగ్ ఇండియా పాఠశాలల ఏర్పాటు వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు.

ఇంట్లో కూడా అన్ని పనులను ఒకేసారి చేయలేమని, అదే విధంగా ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని దశలవారీగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. గుడిసెల్లో నివసిస్తున్న పేదలకు కొత్త ఇళ్ల మంజూరుకు తాను ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానన్నారు.

గతంలో మూడు రోజులకోసారి తాగునీరు సరఫరా జరిగేదని, ప్రస్తుతం ప్రతిరోజూ తాగునీరు అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మున్నేరు వరదల కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు చేపట్టామని చెప్పారు. కొన్ని ప్రాంతాల్లో ఉన్న సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించి పనులను పూర్తి చేస్తామని పేర్కొన్నారు.

డివిజన్లలో జరుగుతున్న అభివృద్ధి పనులను స్థానిక ప్రజాప్రతినిధులు పర్యవేక్షించాలని, రోడ్లు, డ్రెయిన్ల నాణ్యతపై దృష్టి పెట్టాలని మంత్రి సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచకపోతే ప్రజల ఆదాయం ఆసుపత్రులకే వెచ్చించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఖాళీ స్థలాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు మొక్కలు నాటేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. హైదరాబాద్ తరహాలో ఖమ్మం నగరం లోనూ వేగంగా అభివృద్ధి జరుగుతోందని, రోడ్ల విస్తరణ, జాతీయ రహదారుల నిర్మాణంతో వ్యాపార అవకాశాలు పెరుగుతున్నాయని మంత్రి తెలిపారు.

సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఖమ్మం నగర అభివృద్ధిపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని అన్నారు. మున్నేరు వరదల నేపథ్యంలో రూ.600 కోట్లతో రిటైనింగ్ వాల్ ప్రాజెక్టుకు మంత్రి కృషి చేశారని, పనుల పురోగతిని స్వయంగా పర్యవేక్షిస్తున్నారని తెలిపారు.వెలుగుమట్ల అర్బన్ పార్కును హైదరాబాద్ కేబీఆర్ పార్కు తరహాలో అభివృద్ధి చేస్తున్నారని, ప్రజలు సాయంత్రం వేళల్లో ఆహ్లాదకరంగా గడిపే కేంద్రంగా తీర్చిదిద్దుతున్నారని చెప్పారు. ఖమ్మం ఖిల్లా రోప్‌వే ప్రాజెక్టు అభివృద్ధి పనులు కూడా కొనసాగుతున్నాయని తెలిపారు. నగర సుందరీకరణ, పచ్చదనం పెంపుపై మంత్రి ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని పేర్కొన్నారు.

ఖమ్మం మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ మంత్రి ఆదేశాల మేరకు ప్రతి డివిజన్‌లో మెరుగైన రోడ్లు, డ్రెయిన్లు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనతో పాటు పారిశుద్ధ్యం, పచ్చదనం పెంపునకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రజా పాలనలో గత రెండున్నర సంవత్సరాలుగా మహిళా సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో పాటు స్వయం సహాయక సంఘాలకు ఆర్టీసీ బస్సులను అద్దె ప్రాతిపదికన అందించి ఆదాయ వనరులు కల్పిస్తున్నామని తెలిపారు. వర్షాకాలంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రతి డివిజన్‌లో మొక్కలు నాటేందుకు అనువైన ప్రదేశాలను గుర్తించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఖాదర్ బాబా, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, ఆర్డీవో శ్రీనివాస్, సంబంధిత జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.





# గోపాల్‌పూర్ చెరువు అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

**కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**

**హన్మకొండ,జూన్10(తెలంగాణ ముచ్చట్లు):** హనుమకొండలోని గోపాల్‌పూర్ ఊర చెరువుకు సంబంధించిన పూడికతీత, రీటైనింగ్ వాల్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఇన్‌ఛార్జి కమిషనర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. బుధవారం గోపాల్‌పూర్‌లో జరుగుతున్న చెరువు పూడికతీత, రీటైనింగ్ వాల్ నిర్మాణ పనుల పురోగతిని కలెక్టర్ సాగునీటిపారుదల, మున్సిపల్ శాఖ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతి, ఎదురవుతున్న సమస్యలు, పూర్తి చేయాల్సిన గడువులపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చెరువు అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేయాలని సూచించారు. పూడికతీత, రీటైనింగ్ వాల్ నిర్మాణ పనులు నిర్దేశిత సమయంలో పూర్తయ్యేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. అభివృద్ధి పనుల అమలులో జాప్యానికి తావులేకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ పర్యటనలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎస్ఈ రాజ్‌కుమార్, ఈఈ రవికుమార్, సాగునీటిపారుదల శాఖ ఈఈ కిరణ్‌కుమార్, హనుమకొండ తహసీల్దార్ రవీందర్‌రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.





# కడిపికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో

**హన్మకొండ,జూన్10(తెలంగాణ ముచ్చట్లు):**హనుమకొండ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్.డి. రాంకుమార్ కడిపికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అవుట్ పేషంట్ విభాగం, ప్రయోగశాల, ప్రసవ గదిని పరిశీలించి వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆసుపత్రిలో అందిస్తున్న ఓపీ సేవలను మరింత మెరుగుపరచాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రసవాల సంఖ్య తక్కువగా ఉండటానికి గల కారణాలను వైద్యాధికారి, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీకి ఆరు కిలోమీటర్ల పరిధిలో ప్రధాన ఆసుపత్రులు అందుబాటులో ఉండటంతో గర్భిణులు అక్కడికే వెళ్తున్నట్లు సిబ్బంది వివరించగా, కనీసం మూడు కిలోమీటర్ల పరిధిలోని ప్రజలకు అవగాహన కల్పించి పీహెచ్‌సీలో ప్రసవాలు జరిగేలా ప్రోత్సహించాలని సూచించారు. అనంతరం నేచురోపతి డిస్పెన్సరీని సందర్శించిన ఆయన, మొదటి త్రైమాసిక గర్భిణులకు ప్రతిరోజు కనీసం గంటసేపు సులభమైన వ్యాయామాలు నేర్పించాలని శిక్షకుడికి సూచించారు. అలాగే రక్తపోటు, మధుమేహంతో బాధపడుతున్న వారికి కూడా వారు చేయగలిగే సులభమైన వ్యాయామాలను నేర్పించాలని తెలిపారు. దీంతో ప్రజల్లో ఆరోగ్యకరమైన జీవనశైలి అలవాట్లు పెంపొందుతాయని పేర్కొన్నారు.30 ఏళ్లు పైబడిన 30,721 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించాల్సి ఉండగా ఇప్పటివరకు 15,167 మందికి మాత్రమే పరీక్షలు నిర్వహించినట్లు అధికారులు తెలియజేశారు. మిగిలిన వారందరికీ కూడా పరీక్షలు పూర్తి చేసి ప్రభుత్వ వైద్య సేవలు, మందులను వినియోగించుకునేలా ప్రోత్సహించాలని ఆదేశించారు. వివిధ ఆరోగ్య కార్యక్రమాలకు సంబంధించిన ప్రగతి నివేదికలను పరిశీలించిన డీఎంహెచ్‌వో, కొన్ని అంశాల్లో లక్ష్యాలకు వెనుకబడినట్లు గమనించి తదుపరి తనిఖీ నాటికి పూర్తి స్థాయి లక్ష్యాలను సాధించాలని సూచించారు. అనంతరం సిబ్బందితో సమావేశమై వారి విధులు, పనితీరును సమీక్షించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రదీప్ రెడ్డి, ఎన్‌సీడీ కార్యక్రమ అధికారి డాక్టర్ శ్రీనివాస్, స్థానిక వైద్యాధికారి డాక్టర్ ఇర్ఫాన్ పాల్గొన్నారు.

## ఆర్‌జేడీ మదన్‌మోహన్‌కు శుభాకాంక్షలు తెలిపిన అసోసియేషన్ నాయకులు



**హనుమకొండ,జూన్10(తెలంగాణ ముచ్చట్లు):** వరంగల్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్‌జేడీ)గా బదిలీపై వచ్చిన పి. మదన్‌మోహన్‌ను అసోసియేషన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు డైరీని బహుకరించి, నూతన బాధ్యతల్లో విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు.నూతన బాధ్యతల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ శాఖ అభివృద్ధికి కృషి చేయాలని నాయకులు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర చీఫ్ ప్యాట్రన్ లక్కిరెడ్డి సంజీవరెడ్డి, రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు లునావత్ నరేంద్రనాయక్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బాసిరి రాజిబాపు, వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్డే కిషన్, భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు మధుసూదన్, జనగామ జిల్లా అధ్యక్షుడు, హనుమకొండ జిల్లా గౌరవ అధ్యక్షుడు గుండు సదానందం, మాడిశెట్టి శ్రీనివాస్, హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోత్ శ్రీనివాస్ నాయక్, వరంగల్ ఉపాధ్యక్షుడు అనుముల రవి పాల్గొన్నారు.

## సెర్ఫ్ లక్ష్యాల సాధనకు కృషి చేయాలి

- **మహిళా సంఘాల అభివృద్ధిపై దృష్టి**
- **కిశోర బాలికలకు ప్రత్యేక శిక్షణ**
- **స్వయం ఉపాధికి కొత్త అవకాశాలు**




**నారాయణపేట, జూన్ 10 (తెలంగాణ ముచ్చట్లు):** జిల్లాలో సెర్ఫ్ కార్యకలాపాలకు సంబంధించిన అన్ని ప్రమాణాలను మెరుగుపరచాలని జిల్లా కలెక్టర్ సీహెచ్ ప్రియాంక అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి స్త్రీనిధి సమీక్షా కమిటీ సమావేశంలో ఆమె పాల్గొని వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మహిళా సంఘాల యూనిట్లను గుర్తించి వాటి అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపారు. జిల్లాకు మంజూరైన మహిళా విక్రయ కేంద్రాన్ని సమర్థవంతంగా వినియోగించుకునేలా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. జిల్లాలోని కిశోర బాలికల సంఘాల్లో ప్రతిభ కలిగిన బాలికలను గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణ అవకాశాలు కల్పించాలని కలెక్టర్ పేర్కొన్నారు. చిత్రీకరణ, కంప్యూటర్ నైపుణ్యాల శిక్షణ కోసం ఎంపికైన బాలికలను హైదరాబాద్‌కు పంపే ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసే ఉత్పత్తులకు మార్కెట్ అవకాశాలు పెంచేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని మార్కెట్‌లో ప్రతి శుక్రవారం మహిళా సంఘాల ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయాల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఉత్పత్తులకు బ్రాండింగ్, ప్రచారం కల్పించి మహిళల ఆదాయాన్ని పెంచే దిశగా పనిచేయాలని సూచించారు.

పాఠశాల విద్యార్థుల యూనిఫాంల కుట్టు పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మండలాల వారీగా అందిన వస్త్రాలను వెంటనే పంపిణీ చేసి యూనిఫాంల తయారీ బాధ్యతలను సంబంధిత సిబ్బంది సమర్థవంతంగా నిర్వహించాలని పేర్కొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో సమన్వయం చేసుకుంటూ విద్యార్థులకు యూనిఫాంలను అందించాలని సూచించారు. సమావేశంలో జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అరుంధతి, మున్సిపల్ కమిషనర్ శంకర్, గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులు, మండల స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. మహిళా సాధికారత, స్వయం ఉపాధి అవకాశాల పెంపుదల, యువత నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని కలెక్టర్ సూచించారు.

## నూతన వైద్యాధికారిణికి శుభాకాంక్షలు



**ఆదిలాబాద్, జూన్ 10 (తెలంగాణ ముచ్చట్లు):** జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణిగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ పి. సాధన బుధవారం జిల్లా కలెక్టర్ రాజర్షి షాను మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్ శిబిర కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో ఆమె కలెక్టర్‌కు పూలమొక్కను అందజేశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా నూతన బాధ్యతలు చేపట్టిన డాక్టర్ సాధనకు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందేలా ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలని సూచించారు. వైద్య ఆరోగ్య శాఖ కార్యకలాపాలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండే సేవలపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించడంతో పాటు వైద్య సదుపాయాల విస్తరణకు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రజారోగ్య పరిరక్షణలో వైద్య శాఖ కీలక పాత్ర పోషిస్తుందని, ప్రతి కార్యక్రమాన్ని సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు. జిల్లాలో అమలవుతున్న ఆరోగ్య కార్యక్రమాలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు కూడా మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి మనోహర్, డాక్టర్ నరేందర్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు. నూతన బాధ్యతలు చేపట్టిన డాక్టర్ సాధనకు అధికారులు శుభాకాంక్షలు తెలియజేశారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# జీవితాన్ని అందంగా మార్చే దినం

- చిన్న సహాయం గొప్ప మార్పు
- మానవత్వమే నిజమైన సంపద
- సంతోషం పంచితేనే ఆనందం

ఆధునిక ప్రపంచంలో మనిషి జీవితం వేగంగా మారిపోతోంది. సాంకేతికత అభివృద్ధి చెందుతోంది. సౌకర్యాలు పెరుగుతున్నాయి. సంపద, హోదా, అవకాశాలు విస్తరిస్తున్నాయి. కానీ అదే సమయంలో మానవ సంబంధాలు క్రమంగా బలహీనపడుతున్నాయి. ఒకప్పుడు కుటుంబాలు, బంధువులు, పొరుగువారితో కలిసి జీవించిన సమాజం నేడు వ్యక్తిగత జీవితాల వైపు అడుగులు వేస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో జీవితాన్ని అందంగా మార్చే దినం మనకు ఎంతో విలువైన సందేశాన్ని అందిస్తోంది. జీవిత సౌందర్యం డబ్బులో కాదు, మనుషుల మధ్య ప్రేమలో ఉందని గుర్తు చేస్తోంది. మన చుట్టూ ఉన్నవారి జీవితాల్లో చిన్న వెలుగును నింపగలిగితే అదే నిజమైన ఆనందమని ఈ ప్రత్యేక దినం చెబుతోంది. జీవితాన్ని అందంగా మార్చడం అంటే గొప్ప పనులు చేయడం మాత్రమే కాదు. చిన్న చిన్న మంచి పనులు కూడా ఒకరి జీవితాన్ని పూర్తిగా మార్చగలవు. రోడ్డుపై సహాయం కోసం ఎదురుచూస్తున్న వృద్ధుడికి చేయూత ఇవ్వడం, ఆకలితో ఉన్న వారికి ఆహారం అందించడం, నిరాశలో ఉన్న వ్యక్తికి ధైర్యం చెప్పడం, బాధలో ఉన్న స్నేహితుడికి తోడుగా నిలవడం వంటి చర్యలు ఎంతో గొప్పవి. మనం సాధారణంగా భావించే ఈ పనులు ఎదుటివారికి అమూల్యమైనవిగా మారుతాయి. కొన్నిసార్లు ఒక చిరునవ్వు, ఒక ఆప్యాయమైన పలకరింపు, ఒక మంచి మాట కూడా జీవితంలో ఆశను నింపగలదు. అందుకే మంచి పనులకు పరిమాణం ఉండదని, వాటి వెనుక ఉన్న మనసే ముఖ్యమని పెద్దలు చెబుతుంటారు. నేటి సమాజంలో ఒత్తిడి, ఆందోళన, ఒంటరితనం వంటి సమస్యలు వేగంగా పెరుగుతున్నాయి. చదువు, ఉద్యోగం, ఆర్థిక సమస్యలు, కుటుంబ బాధ్యతలు ఇలా అనేక కారణాలతో ప్రజలు మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. చాలామంది తమ బాధలను బయటకు చెప్పుకోలేక మౌనంగా జీవిస్తున్నారు. అలాంటి సమయంలో వారిని అర్థం చేసుకునే ఒక వ్యక్తి ఉంటే చాలు, వారి జీవితంలో గొప్ప మార్పు వస్తుంది. ఒక మంచి స్నేహితుడు, ఒక ప్రోత్సాహకరమైన మాట, ఒక సహాయక హస్తం ఎన్నో జీవితాలను నిలబెట్టగలవు. అందుకే జీవితాన్ని అందంగా మార్చే దినం కేవలం ఒక ప్రత్యేక దినం మాత్రమే కాదు, మానవత్వాన్ని మేల్కొలిపే ఒక సామాజిక సందేశంగా నిలుస్తోంది. కుటుంబ వ్యవస్థలో కూడా ఈ దినం ప్రాముఖ్యత ఎంతో ఉంది. ప్రస్తుతం చాలా కుటుంబాల్లో సభ్యులు ఒకే ఇంట్లో ఉన్నప్పటికీ భావోద్వేగపరంగా దూరమవుతున్నారు. పని ఒత్తిడి, సాంకేతిక పరికరాల వినియోగం, సమయాభావం కారణంగా కుటుంబ సభ్యుల మధ్య సంభాషణలు తగ్గిపోతున్నాయి. తల్లిదండ్రులు పిల్లలకు సమయం కేటాయించలేకపోతున్నారు. పిల్లలు తమ భావాలను పంచుకోలేకపోతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కుటుంబ సభ్యులతో కొంత సమయం గడపడం, వారి సమస్యలను వినడం, ప్రేమను వ్యక్తపరచడం ద్వారా కుటుంబ జీవితం మరింత అందంగా మారుతుంది. బలమైన కుటుంబాలే బలమైన సమాజానికి పునాదిగా నిలుస్తాయి. మానవత్వం అనేది సమాజాన్ని నిలబెట్టే అత్యంత గొప్ప విలువ. మనం ఎదుటివారి బాధను అర్థం చేసుకున్నప్పుడు, వారి కష్టాల్లో భాగస్వాములైనప్పుడు సమాజంలో సానుకూల మార్పులు వస్తాయి. ప్రకృతి వైపరీత్యాలు, ప్రమాదాలు, సంక్షోభాల సమయంలో ప్రజలు ఒకరికొకరు సహాయం చేయడం ద్వారా ఈ విలువ ఎంత గొప్పదో నిరూపిస్తున్నారు. సమాజంలో ప్రతి వ్యక్తి రోజుకు ఒక మంచి పని చేయాలని నిర్ణయించుకుంటే అనేక జీవితాల్లో మార్పు తీసుకురావచ్చు. దయ, కరుణ, సేవాభావం వంటి విలువలు మన సంస్కృతికి మూలస్తంభాలు. వాటిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత. విద్యార్థుల జీవితాల్లో కూడా ఈ దినం ఒక ప్రత్యేక సందేశాన్ని అందిస్తుంది. చదువులో ప్రతిభ సాధించడం ఎంత ముఖ్యమో, మంచి మనిషిగా ఎదగడం కూడా అంతే ముఖ్యమని గుర్తు చేస్తుంది. పోటీ ప్రపంచంలో ముందుకు సాగుతూ ఇతరుల పట్ల గౌరవం, సహాయం చేసే స్వభావం, సామాజిక బాధ్యత వంటి లక్షణాలను పెంపొందించుకోవాలి. విద్య అనేది కేవలం ఉద్యోగం కోసం మాత్రమే కాదు, సమాజానికి ఉపయోగపడే వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దడం కోసం కూడా ఉండాలి. ఇతరులకు ఉపయోగపడే జీవితం గడిపినప్పుడే నిజమైన విజయాన్ని పొందినట్టవుతుంది.

జీవితాన్ని అందంగా మార్చే దినం మనందరికీ ఒక గొప్ప పాఠాన్ని నేర్పుతోంది. ఆనందం అనేది ఖరీదైన వస్తువుల్లో లేదు. అది మనం పంచే ప్రేమలో ఉంది. సంపదలో లేదు, సేవలో ఉంది. హోదాలో లేదు, మానవత్వంలో ఉంది. ఒక మంచి మాట, ఒక చిన్న సహాయం, ఒక ఆప్యాయమైన చిరునవ్వు ఎన్నో జీవితాల్లో వెలుగులు నింపగలవు. మన చుట్టూ ఉన్నవారి జీవితాల్లో సంతోషాన్ని నింపడానికి ప్రయత్నించినప్పుడే మన జీవితం కూడా అర్థవంతంగా మారుతుంది. ప్రతి రోజు ఒక మంచి పని చేయాలనే సంకల్పంతో ముందుకు సాగితే వ్యక్తిగత జీవితం మాత్రమే కాదు, మొత్తం సమాజం కూడా మరింత అందంగా, ఆనందంగా, మానవత్వంతో నిండిన ప్రపంచంగా మారుతుంది.

# మోదీ పేరిట చారిత్రాత్మక రికార్డు

- నెహ్రూ ఘనతకు ముగింపు
- వరుస పాలనలో కొత్త మైలురాయి
- దేశవ్యాప్తంగా అభినందనలు



భారత రాజకీయ చరిత్రలో అరుదైన ఘట్టం ఆవిష్కృతమైంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశంలో ఎన్నికైన ప్రధానమంత్రిగా అత్యధిక కాలం నిరవధికంగా పదవిలో కొనసాగిన నాయకుడిగా కొత్త చరిత్ర సృష్టించారు. గతంలో తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ పేరిట ఉన్న రికార్డును అధిగమిస్తూ మోదీ ఈ ఘనత సాధించారు. దీంతో భారత రాజకీయ చరిత్రలో ఆయన పేరు మరో ప్రత్యేక మైలురాయిగా నిలిచింది.

2014 మే 26న తొలిసారిగా ప్రధానమంత్రి పదవిని చేపట్టిన నరేంద్ర మోదీ, ఆ తర్వాత 2019లో రెండోసారి, 2024లో మూడోసారి ప్రజల మద్దతుతో అధికారంలోకి వచ్చారు. బుధవారం నాటికి ఆయన ప్రధానిగా వరుసగా 4,399 రోజులు పూర్తి చేసుకున్నారు. ఇప్పటి వరకు జవహర్‌లాల్ నెహ్రూ పేరిట ఉన్న 4,398 రోజుల రికార్డు చెరిపివేయబడింది. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా భారతీయ జనతా పార్టీ శ్రేణులు సంబరాలు నిర్వహించాయి. మోదీ నాయకత్వంలో గత పన్నెండు సంవత్సరాల కాలంలో దేశం మౌలిక సదుపాయాలు, ఆర్థికాభివృద్ధి, సాంకేతిక రంగం, సంక్షేమ పథకాల అమలులో గణనీయమైన పురోగతి సాధించిందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి నుంచి అంతరిక్ష పరిశోధనల వరకు అనేక రంగాల్లో భారతదేశం ప్రపంచ దృష్టిని ఆకర్షించే స్థాయికి చేరుకుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

ఈ చారిత్రాత్మక సందర్భాన్ని పురస్కరించుకుని కేంద్ర మంత్రివర్గం ప్రత్యేక సమావేశం నిర్వహించింది. ప్రధానమంత్రి సేవలను కొనియాడుతూ అభినందన తీర్మానాన్ని ఆమోదించింది. దేశ ప్రజల విశ్వాసం, అభివృద్ధి పట్ల అంకితభావం, సుపరిపాలనకు ఈ రికార్డు నిదర్శనమని కేంద్ర మంత్రులు పేర్కొన్నారు. మోదీ నాయకత్వంలో భారత్ ప్రపంచ వేదికపై మరింత బలమైన దేశంగా ఎదిగిందని అభిప్రాయపడ్డారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కూడా ప్రధానమంత్రి మోదీకి ప్రత్యేక అభినందనలు తెలిపారు. దేశ ప్రజల సంక్షేమం కోసం ఆయన నిరంతరం కృషి చేస్తున్నారని, సమాజంలోని అట్టడుగు వర్గాలకు అభివృద్ధి ఫలాలు చేరేలా అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నారని కొనియాడారు. గిరిజనులు, పేదలు, మహిళలు, యువత అభ్యున్నతికి చేపట్టిన కార్యక్రమాలు దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఈ రికార్డు ఒక ప్రత్యేక అధ్యాయంగా నిలవనుంది. వరుసగా మూడు పర్యాయాలు ప్రజల మద్దతుతో అధికారంలో కొనసాగుతూ దేశ పాలనలో సుదీర్ఘ కాలం పూర్తి చేసిన నాయకుడిగా నరేంద్ర మోదీ సాధించిన ఈ ఘనత రాజకీయ వర్గాల్లో విస్తృత చర్చకు దారితీసింది. భారత అభివృద్ధి ప్రయాణంలో ఇది మరో చారిత్రాత్మక మైలురాయిగా నిలిచిందని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

# జనగాం జిల్లాకు డీజీ అనిల్ కుమార్ రాక

- ఘన స్వాగతం పలికిన అధికారులు
- గౌరవ వందనం స్వీకరణ
- అరైవ్ అలైవ్ కార్యక్రమానికి హాజరు



**జనగాం, జూన్ 10 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అరైవ్ అలైవ్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యేందుకు పోలీసు శాఖ ఆపరేషన్ల విభాగం డైరెక్టర్ జనరల్ అనిల్ కుమార్ జనగాం జిల్లాకు విచ్చేశారు. జిల్లాకు చేరుకున్న ఆయనకు జిల్లా యంత్రాంగం ఘన స్వాగతం పలికింది. జనగాంలో అడుగుపెట్టిన డైరెక్టర్ జనరల్ అనిల్ కుమార్‌కు పోలీసు కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఉప పోలీసు కమిషనర్ రాజ మహేంద్ర నాయక్ పూల మొక్కలు అందజేసి ఆత్మీయ స్వాగతం పలికారు. జిల్లా పోలీసు శాఖ తరపున ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్వాగత కార్యక్రమం ఆకట్టుకుంది. అధికారులు ఆయనకు జిల్లా పరిస్థితులు, కార్యక్రమాల వివరాలను తెలియజేశారు. అనంతరం డైరెక్టర్ జనరల్ అనిల్ కుమార్ సాయుధ పోలీసు బలగాలు సమర్పించిన గౌరవ వందనాన్ని స్వీకరించారు. పోలీసు సిబ్బంది క్రమశిక్షణతో నిర్వహించిన గౌరవ వందనం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా పోలీసు బలగాల పనితీరును ఆయన అభినందించినట్లు తెలిసింది. ప్రజల్లో రహదారి భద్రతపై అవగాహన పెంపొందించడం, ప్రమాదాల నివారణపై చైతన్యం కల్పించడం లక్ష్యంగా నిర్వహిస్తున్న అరైవ్ అలైవ్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రజల ప్రాణ భద్రతకు సంబంధించిన అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ చేపడుతున్న చర్యలను పరిశీలించారు. రహదారి నియమాల పట్ల ప్రజల్లో మరింత అవగాహన పెరగాల్సిన అవసరం ఉందని అధికారులు పేర్కొన్నారు. ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల ద్వారా ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడమే లక్ష్యమని అధికారులు తెలిపారు.

పోలీసు శాఖ చేపడుతున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, భద్రతా చర్యలపై కూడా ఈ సందర్భంగా సమీక్ష నిర్వహించినట్లు సమాచారం. డైరెక్టర్ జనరల్ అనిల్ కుమార్ పర్యటనతో జిల్లా పోలీసు శాఖలో ఉత్సాహం నెలకొంది. కార్యక్రమంలో పోలీసు శాఖ ఉన్నతాధికారులు, జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ప్రజల భద్రత, రహదారి ప్రమాదాల నివారణకు సంబంధించిన కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపట్టాలని అధికారులు సంకల్పించారు.


# పరమ ఏకాదశి మహిమ



- శ్రీహరి కృపకు మార్గం
- ఉపవాసానికి విశిష్ట స్థానం
- ఆధ్యాత్మిక చైతన్యానికి అవకాశం

హిందూ సంప్రదాయంలో ఏకాదశి తిథికి అత్యంత పవిత్రమైన స్థానం ఉంది. ప్రతి నెలలో రెండు ఏకాదశులు వచ్చినప్పటికీ, అధిక మాసంలో వచ్చే పరమ ఏకాదశి ప్రత్యేకమైనదిగా పరిగణించబడుతుంది. ఈ రోజును శ్రీమహావిష్ణువుకు అత్యంత ప్రీతిపాత్రమైన దినంగా భావిస్తారు. భక్తులు ఉపవాసం ఆచరిస్తూ, విష్ణు నామస్మరణ చేస్తూ, ధ్యానంలో గడుపుతారు. పురాణాల ప్రకారం పరమ ఏకాదశి వ్రతం ఆచరించడం ద్వారా పాప విముక్తి కలుగుతుందని, జీవితంలో శాంతి, సుఖసంతోషాలు లభిస్తాయని విశ్వాసం. అందువల్ల ఈ పవిత్ర దినానికి దేశవ్యాప్తంగా లక్షలాది మంది భక్తులు విశేష ప్రాధాన్యం ఇస్తుంటారు. పురాణాల్లో పరమ ఏకాదశి గురించి అనేక విశేషాలు ప్రస్తావించబడ్డాయి. ఈ రోజున శ్రీమహావిష్ణువును భక్తిశ్రద్ధలతో ఆరాధించిన వారికి అశ్వమేధ యాగం చేసినంత పుణ్యం లభిస్తుందని చెబుతారు. ముఖ్యంగా అధిక మాసంలో వచ్చే ఈ ఏకాదశి ఆధ్యాత్మిక శక్తిని పెంచుతుందని విశ్వసిస్తారు. జీవితంలో ఎదురయ్యే అడ్డంకులు తొలగి శుభఫలితాలు కలుగుతాయని భక్తులు నమ్ముతారు. అందుకే చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా అనేక మంది ఈ రోజున ఉపవాస దీక్షలు చేపడతారు. పరమ ఏకాదశి సందర్భంగా భక్తులు తెల్లవారుజామునే లేచి పవిత్ర స్నానాలు ఆచరిస్తారు. అనంతరం విష్ణుమూర్తికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. తులసి దళాలతో పూజించడం, విష్ణు సహస్రనామ పారాయణం చేయడం, భగవద్గీత పఠించడం, భజనలు నిర్వహించడం వంటి కార్యక్రమాలు చేపడతారు. కొందరు రోజంతా నిరాహార దీక్ష పాటిస్తే, మరికొందరు పండ్లు, పాలు మాత్రమే తీసుకుంటూ ఉపవాసాన్ని కొనసాగిస్తారు. రాత్రి జాగరణ చేసి శ్రీహరి నామస్మరణలో గడపడం కూడా ఈ వ్రతంలో ఒక ముఖ్యమైన భాగంగా భావిస్తారు. ఈ పవిత్ర దినం భక్తిని మాత్రమే కాకుండా నియమ నిష్ఠలను కూడా పెంపొందిస్తుంది. ఉపవాసం ద్వారా మనస్సును అదుపులో ఉంచడం, ఇంద్రియాలను నియంత్రించడం, ఆధ్యాత్మిక చింతన పెంపొందించుకోవడం సాధ్యమవుతుందని ఆధ్యాత్మిక గురువులు చెబుతున్నారు. నేటి వేగవంతమైన జీవన శైలిలో మనసుకు ప్రశాంతత దొరకడం కష్టమవుతున్న సమయంలో ఇలాంటి వ్రతాలు మానసిక ప్రశాంతతను అందిస్తాయి. ఒకరోజు అయినా భౌతిక విషయాల నుంచి దూరంగా ఉండి దైవ చింతనలో గడపడం మనసుకు కొత్త ఉత్సాహాన్ని కలిగిస్తుంది. పరమ ఏకాదశి రోజున దానం చేయడం కూడా విశేష పుణ్యప్రదంగా భావిస్తారు. అన్నదానం, వస్త్రదానం, గోసేవ, అవసరమైన వారికి సహాయం చేయడం వంటి సత్కార్యాలు చేయాలని ధర్మశాస్త్రాలు సూచిస్తున్నాయి. దైవారాధనతో పాటు మానవ సేవ కూడా సమానంగా ముఖ్యమనే సందేశాన్ని ఈ పవిత్ర దినం అందిస్తుంది. భక్తి, దయ, కరుణ, సేవాభావం వంటి విలువలను పెంపొందించే అవకాశంగా పరమ ఏకాదశిని చూడాలని పండితులు సూచిస్తున్నారు. దేశంలోని అనేక విష్ణు ఆలయాలు పరమ ఏకాదశి సందర్భంగా భక్తులతో కిటకిటలాడుతాయి. ప్రత్యేక అలంకరణలు, అభిషేకాలు, అర్చనలు, భజన కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఆలయాల్లో జరిగే ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వేలాది మంది భక్తులు తరలివస్తారు. ముఖ్యంగా శ్రీమహావిష్ణువు ఆలయాల్లో ఈ రోజున ప్రత్యేక ఉత్సాహం కనిపిస్తుంది. భక్తులు కుటుంబ సమేతంగా ఆలయాలను సందర్శించి స్వామివారి ఆశీస్సులు పొందుతారు. భారతీయ సంస్కృతిలో వ్రతాలు, పండుగలు కేవలం ఆచారాలుగా మాత్రమే కాకుండా మనిషి వ్యక్తిత్వ వికాసానికి దోహదపడే ఆధ్యాత్మిక సాధనాలుగా భావించబడతాయి. పరమ ఏకాదశి కూడా అలాంటి విశిష్టమైన దినమే. భక్తి, నియమం, ధ్యానం, దానం, సేవాభావం వంటి సద్గుణాలను పెంపొందించే ఈ పవిత్ర సందర్భం మన సంస్కృతి వైభవాన్ని ప్రతిబింబిస్తుంది. శ్రీమహావిష్ణువు అనుగ్రహాన్ని పొందాలనే ఆకాంక్షతో భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఆచరించే పరమ ఏకాదశి, ఆధ్యాత్మిక జీవితానికి ఒక వెలుగు దారిగా నిలుస్తోంది.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
మంగళవారం - 9 - జూన్ 2026

# చిత్రసీమకు తీరని లోటు.. భారతీరాజా ఇక లేరు

దక్షిణాది చిత్ర పరిశ్రమలో తీవ్ర విషాదం నెలకొంది. ప్రముఖ దర్శకుడు, నటుడు భారతీరాజా కన్నుమూశారు. 85 ఏళ్ల వయసున్న ఆయన కొంతకాలంగా వయోభారంతో పాటు అనారోగ్య సమస్యలతో బాధపడుతూ చెన్నైలోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. ఆయన మరణ వార్తతో తమిళ చిత్రసీమతో పాటు దేశవ్యాప్తంగా సినీ అభిమానులు దిగ్భ్రాంతికి గురయ్యారు. గత ఏడాది ఆయన కుటుంబాన్ని తీవ్ర విషాదం వెంటాడింది. భారతీరాజా కుమారుడు మనోజ్ భారతీరాజా గుండెపోటుతో అకాల మరణం చెందడంతో ఆయన తీవ్ర మనోవేదనకు గురయ్యారు. కొడుకు మరణాన్ని జీర్ణించుకోలేకపోయిన భారతీరాజా ఆరోగ్యం ఆ తర్వాత మరింత క్షీణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కుమారుడి అంత్యక్రియల సమయంలో ఆయన పడిన ఆవేదన అందరినీ కలచివేసింది.

ఇటీవల శ్వాసకోశ సంబంధిత సమస్యలు, ఉబ్బసం కారణంగా ఆయనను చెన్నైలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్చి చికిత్స అందించారు. వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందినప్పటికీ, వయసు పైబడటంతో ఆరోగ్య పరిస్థితి తరచూ ఆందోళనకరంగా మారింది. శారీరక సమస్యలతో పాటు మానసికంగా కూడా ఆయన తీవ్రంగా కుంగిపోయినట్లు సన్నిహితులు పేర్కొన్నారు.

భారతీరాజా 1977లో విడుదలైన 'పదహారేళ్ల వయసు' చిత్రంతో దర్శకుడిగా సినీ రంగంలో అడుగుపెట్టారు. గ్రామీణ జీవన విధానాన్ని అత్యంత సహజంగా, హృద్యంగా వెండితెరపై ఆవిష్కరించి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఆ కాలంలో నగర నేపథ్య కథలే ఎక్కువగా వస్తున్న సమయంలో గ్రామీణ కథలకు కొత్త ప్రాణం పోసిన దర్శకుడిగా ఆయన పేరు నిలిచిపోయింది. నాలుగు దశాబ్దాలకు పైగా సాగిన సినీ ప్రస్థానంలో ఆయన నలభైకి పైగా చిత్రాలకు దర్శకత్వం వహించారు. అనేక విజయవంతమైన చిత్రాలను అందించి భారతీయ సినీ చరిత్రలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. ఆయన రూపొందించిన ఎన్నో చిత్రాలు నేటికీ క్లాసిక్ చిత్రాలుగా గుర్తింపు పొందుతున్నాయి.

దర్శకుడిగానే కాకుండా నటుడిగానూ భారతీరాజా ప్రేక్షకులను మెప్పించారు. తనదైన నటనతో విభిన్నమైన పాత్రలను పోషించి ప్రశంసలు అందుకున్నారు. ఇటీవల విడుదలైన 'తుడరుం' చిత్రంలో ఆయన చివరిసారిగా ప్రేక్షకుల ముందుకు వచ్చారు. ఇంకా విడుదల కావాల్సిన 'పులవర్' చిత్రం నటుడిగా ఆయన చివరి చిత్రంగా నిలవనుంది.

గ్రామీణ జీవిత సౌందర్యాన్ని, మానవ సంబంధాల విలువను సహజత్వంతో ఆవిష్కరించిన అరుదైన దర్శకుడిగా భారతీరాజా చిరస్థాయిగా గుర్తుండిపోతారు. ఆయన ప్రభావంతో సినీ రంగంలోకి వచ్చిన ఎన్నో తరాల దర్శకులు ఇప్పటికీ ఆయనను ఆదర్శంగా భావిస్తుంటారు. భారతీరాజా మరణంతో దక్షిణాది చిత్రసీమ ఒక గొప్ప సినీ దిగ్గజాన్ని కోల్పోయింది.

ఆయన మరణంపై సినీ ప్రముఖులు, రాజకీయ నాయకులు, అభిమానులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తున్నారు. భారతీరాజా రూపొందించిన చిత్రాలు, ఆయన సృష్టించిన పాత్రలు, ఆయన చూపించిన సృజనాత్మక దారి భారతీయ సినీ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోనున్నాయి.



# ధనుష్ మూవీలో క్రేజీ రోల్!

సహజ నటనతో కోట్లాది మంది అభిమానుల మనసులు గెలుచుకున్న లేడీ పవర్ స్టార్ సాయిపల్లవి మరో విభిన్న పాత్రలో కనిపించబోతున్నట్లు సినీ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. ప్రముఖ నటుడు ధనుష్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న కొత్త చిత్రంలో ఆమె శక్తివంతమైన పోలీసు అధికారిణి పాత్రను పోషించనున్నట్లు సమాచారం. 'అమరన్' చిత్రంతో ఘన విజయాన్ని అందుకున్న దర్శకుడు రాజ్‌కుమార్ పెరియసామి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ధనుష్ కెరీర్‌లో 55వ చిత్రంగా రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్‌పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పుడు సాయిపల్లవి పేరు వినిపించడంతో సినిమాపై మరింత ఆసక్తి పెరిగింది. ఇప్పటివరకు ప్రేమకథలు, కుటుంబ భావోద్వేగాలు, సహజమైన పాత్రలతో ప్రేక్షకులను ఆకట్టుకున్న సాయిపల్లవి, తొలిసారి కఠినమైన పోలీసు అధికారిణి పాత్రలో కనిపించనున్నారనే వార్త అభిమానుల్లో ఉత్సాహాన్ని నింపుతోంది. బాధ్యతాయుతమైన, ధైర్యవంతమైన అధికారిణి పాత్రలో ఆమె నటన ఎలా ఉంటుందో చూడాలని ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. సినీ వర్గాల సమాచారం ప్రకారం, ఈ చిత్రంలో సాయిపల్లవి పాత్ర కథకు కీలకంగా ఉండబోతోందని తెలుస్తోంది. కేవలం కథానాయిక పాత్రకే పరిమితం కాకుండా, కథను ముందుకు నడిపించే శక్తివంతమైన పాత్రను దర్శకుడు రూపొందించినట్లు ప్రచారం సాగుతోంది. 'అమరన్' చిత్రంలో భావోద్వేగాలు, యాక్షన్ అంశాలను సమతూకంగా చూపించిన రాజ్‌కుమార్ పెరియసామి, ఈ చిత్రంలో కూడా సాయిపల్లవి పాత్రను ప్రత్యేకంగా తీర్చిదిద్దినట్లు సమాచారం. నటనకు ప్రాధాన్యత ఇచ్చే సాయిపల్లవి ఈ పాత్ర కోసం ప్రత్యేకంగా సిద్ధమవుతున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. ఈ వార్త సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఖాకీ దుస్తుల్లో సాయిపల్లవిని చూడటం కొత్త అనుభూతిగా ఉంటుందని, ఆమె నటనతో మరోసారి ప్రేక్షకులను మెప్పిస్తారని అభిమానులు అభిప్రాయపడుతున్నారు.

అయితే ఈ పాత్రకు సంబంధించి చిత్ర బృందం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. అయినప్పటికీ ధనుష్ - సాయిపల్లవి - రాజ్‌కుమార్ పెరియసామి కాంబినేషన్‌పై సినీ వర్గాల్లో భారీ చర్చ సాగుతోంది. అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక




# హైవే దోపిడీ ముఠా అరెస్ట్

- అంతర్‌రాష్ట్ర నేరగాళ్ల ఆటకట్టు
- మూడు కేసుల ఛేదన
- నిందితుల నుంచి కీలక స్వాధీనం

**కామారెడ్డి, జూన్ 10 (తెలంగాణ ముచ్చట్లు):**

జాతీయ రహదారులపై రాత్రివేళల్లో ఒంటరిగా ప్రయాణించే వారిని లక్ష్యంగా చేసుకుని దోపిడీలకు పాల్పడుతున్న అంతర్‌రాష్ట్ర దోపిడీ ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. మద్నూర్ పోలీసుల చాకచక్యంతో ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని మూడు దోపిడీ కేసులను ఛేదించారు. పోలీసుల కథనం ప్రకారం, నిందితులు రాత్రి సమయాల్లో హైవేపై ఒంటరిగా ప్రయాణించే వ్యక్తులను అడ్డగించి కత్తులతో బెదిరిస్తూ దోపిడీలకు పాల్పడుతున్నారు. బాధితుల వద్ద ఉన్న నగదు, మొబైల్ ఫోన్లు, ఇతర విలువైన వస్తువులను అపహరించి పరారవుతుండేవారు.

దర్యాప్తు చేపట్టిన మద్నూర్ పోలీసు బృందం సాంకేతిక ఆధారాలు, నిఘా సమాచారంతో నిందితులను గుర్తించి అరెస్ట్ చేసింది. వారి వద్ద నుంచి రెండు మోటార్ సైకిళ్లు, నాలుగు మొబైల్ ఫోన్లు, దోపిడీలకు ఉపయోగించిన కత్తులను స్వాధీనం చేసుకుంది. నిందితుల అరెస్టుతో మూడు కేసులు ఛేదించడంతో పాటు మరికొన్ని నేరాలకు సంబంధించిన వివరాలు కూడా వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు. నిందితుల గత చరిత్రపై కూడా విచారణ కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు.

హైవే మార్గాల్లో ప్రజల భద్రతకు ఎలాంటి ముప్పు కలగకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారని అధికారులు తెలిపారు. రాత్రివేళల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. ఈ కేసును విజయవంతంగా ఛేదించిన మద్నూర్ పోలీసు బృందాన్ని జిల్లా పోలీసు అధికారి అభినందించారు. నేరాల నియంత్రణలో సమర్థవంతంగా పనిచేసిన పోలీసు సిబ్బందిని ప్రశంసిస్తూ భవిష్యత్తులో కూడా ఇదే స్థాయి అప్రమత్తతతో విధులు నిర్వహించాలని సూచించారు.

# సింగరేణిలో కవిత బాయిబాట

- కార్మికులతో ముఖాముఖి సమావేశాలు
- ఆరు రోజుల విస్తృత పర్యటన
- గనుల సమస్యలపై చర్చలు



**హైదరాబాద్, జూన్ 10 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రక్షణ సేన ప్రధాన నాయకురాలు కల్వకుంట్ల కవిత ఈ నెల 15వ తేదీ నుంచి సింగరేణి ప్రాంతాల్లో విస్తృత పర్యటన చేపట్టనున్నారు. ''బాయిబాట'' పేరుతో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో భూగర్భ గనులు, బహిరంగ గనుల వద్ద కార్మికులతో ప్రత్యక్షంగా సమావేశమై వారి సమస్యలు, అభిప్రాయాలు తెలుసుకోనున్నారు. సింగరేణి కార్మికులతో మరింత సన్నిహితంగా మమేకమయ్యే లక్ష్యంతో ఈ పర్యటనను రూపొందించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. మొదటి విడత కార్యక్రమంలో భాగంగా ఆరు రోజుల పాటు ఐదు శాసనసభ నియోజకవర్గాల పరిధిలో కవిత పర్యటించనున్నారు. సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఉద్యోగ భద్రత, సంక్షేమం, గనుల నిర్వహణకు సంబంధించిన అంశాలపై చర్చలు నిర్వహించనున్నారు. కార్మికుల అభిప్రాయాలను నేరుగా తెలుసుకుని భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్లు సమాచారం.

పర్యటనలో భాగంగా జూన్ 15న చెన్నూరు నియోజకవర్గంలోని మందమర్రి ప్రాంత బొగ్గు గనులను సందర్శించనున్నారు. అక్కడ కార్మికులతో సమావేశమై వారి సమస్యలను తెలుసుకోనున్నారు. అనంతరం జూన్ 16న మంచిర్యాల నియోజకవర్గంలోని శ్రీరాంపూర్ ప్రాంతంలో పర్యటించి కార్మికులతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. జూన్ 17న రామగుండం నియోజకవర్గ పరిధిలోని ఆర్‌జీ1 ప్రాంతంలో, జూన్ 18న ఆర్‌జీ2 ప్రాంతంలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా గనుల వద్ద పనిచేస్తున్న కార్మికులను కలిసి వారి అభిప్రాయాలు తెలుసుకోవడంతో పాటు ప్రస్తుత పరిస్థితులపై చర్చించనున్నారు. సింగరేణి భవిష్యత్తుకు సంబంధించిన అంశాలు కూడా ప్రధానంగా ప్రస్తావనకు వచ్చే అవకాశం ఉంది.

జూన్ 19న మంథని నియోజకవర్గంలోని అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టు, ఆర్‌జీ 3 ప్రాంతాలను సందర్శించనున్నారు. అనంతరం జూన్ 20న భూపాలపల్లి నియోజకవర్గంలోని భూపాలపల్లి ఏరియా బొగ్గు గనులు, బహిరంగ గనుల వద్ద పర్యటించి కార్మికులతో సమావేశమవుతారు. పర్యటన ముగింపు సందర్భంగా కార్మికుల సమస్యలపై సమగ్ర నివేదిక రూపొందించే అవకాశం ఉందని తెలుస్తోంది. సింగరేణి కార్మికుల సంక్షేమం, గనుల భవిష్యత్తు, ఉపాధి భద్రత వంటి అంశాలపై అవగాహన పెంచడంతో పాటు కార్మికులతో ప్రత్యక్ష సంబంధాలు బలోపేతం చేయడమే ''బాయిబాట'' కార్యక్రమం ప్రధాన లక్ష్యంగా పార్టీ నాయకులు పేర్కొంటున్నారు. ఈ పర్యటన సింగరేణి ప్రాంత రాజకీయాల్లో ప్రాధాన్యం సంతరించుకుంది.

# ఘనాకు తెలంగాణ సహకారం

- ఫార్మా హబ్‌కు సంపూర్ణ మద్దతు
- ద్వైపాక్షిక బంధాలపై చర్చలు
- పారిశ్రామికాభివృద్ధికి మార్గనిర్దేశం

**హైదరాబాద్, జూన్ 10 (తెలంగాణ ముచ్చట్లు):**



ఆఫ్రికా దేశమైన ఘనా పారిశ్రామికాభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలుగా సహకారం అందించేందుకు సిద్ధంగా ఉందని రాష్ట్ర సమాచార సాంకేతిక, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. ఘనాలో ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేయనున్న ఔషధ తయారీ కేంద్రానికి తెలంగాణ పూర్తి స్థాయి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో ఘనా ఉన్నతస్థాయి ప్రతినిధి బృందంతో జరిగిన సమావేశంలో మంత్రి ఈ విషయాన్ని వెల్లడించారు. ఘనా అధ్యక్ష సలహాదారు ఆగస్టస్ ఒబువాడుం టానో నేతృత్వంలోని ప్రతినిధి బృందం బుధవారం మంత్రి శ్రీధర్ బాబును మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా తెలంగాణ - ఘనా మధ్య ఆర్థిక, పారిశ్రామిక సంబంధాల విస్తరణకు ఉన్న అవకాశాలపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా ఘనా చేపట్టిన ఇరవై నాలుగు గంటల ఆర్థిక వ్యవస్థ, ఎగుమతుల అభివృద్ధి కార్యక్రమాలు, ఔషధ తయారీ కేంద్రం ఏర్పాటు వంటి అంశాలను ప్రతినిధి బృందం వివరించింది.

సమావేశంలో మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ తెలంగాణ అతి తక్కువ కాలంలోనే పారిశ్రామిక రంగంలో విశేష పురోగతి సాధించిందని తెలిపారు. ఔషధ తయారీ, జీవ విజ్ఞాన శాస్త్రాలు, ఎలక్ట్రానిక్స్, విమాన రంగం, ఆహార శుద్ధి, రక్షణ ఉత్పత్తులు, ఆధునిక తయారీ రంగాల్లో తెలంగాణ అంతర్జాతీయ గుర్తింపు పొందిందని వివరించారు. పరిశ్రమల స్థాపనకు అనుకూల వాతావరణం కల్పించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలను కూడా వివరించారు. ఔషధ తయారీ, పరిశోధన, టీకాల ఉత్పత్తి, అంతర్జాతీయ సరఫరా వ్యవస్థ నిర్వహణ, జీవ విజ్ఞాన శాస్త్రాల రంగాల్లో తెలంగాణకు ఉన్న నైపుణ్యాన్ని ఘనాతో పంచుకోవడానికి సిద్ధంగా ఉన్నామని మంత్రి తెలిపారు. ఈ రంగాల్లో అవసరమైన సాంకేతిక సహకారం, మార్గదర్శకత్వం అందిస్తామని హామీ ఇచ్చారు. ఘనా పారిశ్రామిక పురోగతికి తెలంగాణ విశ్వసనీయ భాగస్వామిగా నిలుస్తుందని పేర్కొన్నారు.

ఘనా ప్రతినిధులు తెలంగాణ పారిశ్రామిక అభివృద్ధి నమూనాను ప్రశంసించారు. తమ దేశంలో పారిశ్రామిక, ఆర్థిక పరివర్తనకు తెలంగాణ అనుభవం ఎంతో ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా ఔషధ రంగంలో తెలంగాణ సాధించిన విజయాలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ సమావేశం ద్వారా తెలంగాణ -ఘనా మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలోపేతం అయ్యే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. భవిష్యత్తులో పరిశ్రమలు, పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాల మార్పిడి రంగాల్లో రెండు ప్రాంతాల మధ్య మరింత సహకారం పెరిగే అవకాశాలు ఉన్నాయని పేర్కొంటున్నారు.

# అధికారులతో కీలక సమావేశం

- ప్రాజెక్టులపై ఆదేశాలు జారీ
- రైతు సంక్షేమమే లక్ష్యం
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

**నల్గొండ, జూన్ 10 (తెలంగాణ ముచ్చట్లు):**

నల్గొండ జిల్లా సమగ్ర అభివృద్ధిపై రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి జిల్లా ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సాగునీటి ప్రాజెక్టులు, రహదారుల నిర్మాణం, ధాన్యం సేకరణ తదితర అంశాలపై విస్తృతంగా చర్చించి అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల పురోగతిని మంత్రి సమీక్షించారు. రైతులకు సాగునీటి సమస్యలు తలెత్తకుండా ప్రాజెక్టు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా బ్రాహ్మణ వెల్లెంల ప్రాజెక్టు పనుల్లో జాప్యానికి తావులేకుండా నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని సూచించారు. పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడొద్దని స్పష్టం చేశారు.

రహదారుల అభివృద్ధికి కూడా ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి తెలిపారు. నార్కెట్‌పల్లి రైల్వే పైవంతెన నిర్మాణానికి అవసరమైన చర్యలను వెంటనే చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడేలా అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. జిల్లాలోని ప్రధాన రహదారుల పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించాలని చెప్పారు. ధాన్యం సేకరణ ప్రక్రియపై కూడా మంత్రి సమీక్ష నిర్వహించారు. రైతులు తమ పంటను విక్రయించే సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో సక్రమమైన ఏర్పాట్లు చేసి రైతులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ధాన్యం సేకరణలో పారదర్శకత పాటించాలని స్పష్టం చేశారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. రైతుల అభ్యున్నతికి అవసరమైన అన్ని చర్యలు ప్రభుత్వం చేపడుతోందని చెప్పారు. వ్యవసాయం, సాగునీరు, మౌలిక వసతుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తూ ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. నల్గొండ జిల్లాను అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి పథంలో



నడిపించేందుకు ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యానికి తావులేకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

# అసెంబ్లీని తలపించిన బాలికలు

రాష్ట్రస్థాయి సభలో ప్రతిభ
ప్రజా సమస్యలపై చర్చలు
భవిష్యత్ నాయకత్వానికి పునాది

**హైదరాబాద్, జూన్ 10 (తెలంగాణ ముచ్చట్లు):**





రాష్ట్ర భవిష్యత్తును తీర్చిదిద్దే నాయకత్వ లక్షణాలు చిన్న వయసులోనే పెంపొందించాలనే లక్ష్యంతో నిర్వహించిన కిశోర బాలికల రాష్ట్రస్థాయి మాక్ అసెంబ్లీ సభ అందరినీ ఆకట్టుకుంది. జూబ్లీ హాల్‌లోని పూర్వ శాసన మండలి భవనంలో జరిగిన ఈ కార్యక్రమం నిజమైన అసెంబ్లీ సమావేశాలను తలపించింది. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి ఎంపికైన బాలికలు ప్రజాప్రతినిధుల పాత్రల్లో పాల్గొని ప్రజా సమస్యలపై చర్చలు జరిపి తమ నాయకత్వ ప్రతిభను చాటుకున్నారు. తెల్లటి ఖాదీ దుస్తులు, కండువాలు ధరించి సభకు హాజరైన బాలికలు అధికార పక్షం, ప్రతిపక్ష సభ్యులుగా వ్యవహరిస్తూ సభా కార్యక్రమాలను నిర్వహించారు. ప్రజల సమస్యలను ప్రస్తావిస్తూ ప్రశ్నలు అడగడం, సూచనలు చేయడం, పరిష్కార మార్గాలను వివరించడం వంటి అంశాల్లో అద్భుతమైన అవగాహన ప్రదర్శించారు. ఆరోగ్యం, విద్య, గిరిజన సంక్షేమం, యువత భవిష్యత్తు, సామాజిక మాధ్యమాల ప్రభావం వంటి కీలక అంశాలపై జరిగిన చర్చలు సభకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క బాలికల ప్రతిభను అభినందించారు. చిన్న వయసులోనే వారు ప్రదర్శించిన పరిణితి, సమాజంపై అవగాహన తనను ఎంతో ఆకట్టుకుందని పేర్కొన్నారు. రాజకీయాలంటే కేవలం ఎన్నికలు మాత్రమే కాదని, ప్రజల సమస్యలను తెలుసుకుని వాటికి పరిష్కారాలు చూపే బాధ్యత అని వివరించారు. ప్రజాసేవ చేయాలనే సంకల్పం ఉన్న యువత రాజకీయాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. సామాజిక మాధ్యమాల వినియోగంపై కూడా మంత్రి బాలికలకు విలువైన సూచనలు చేశారు. నేటి కాలంలో యువత ఎక్కువ సమయం సామాజిక మాధ్యమాలకే కేటాయిస్తోందని, దాని ప్రభావాన్ని గుర్తించి సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లక్ష్య సాధన కోసం కష్టపడాలని, చదువుతో పాటు విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని చెప్పారు. నాయకత్వం వహించాలంటే మంచి విద్య, సమాజంపై అవగాహన తప్పనిసరి అని వివరించారు.

ప్రతి బాలిక జీవితంలో క్రమశిక్షణ, సంస్కారం, శ్రమ అనే మూడు విలువలు కీలకమని మంత్రి పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన వారైనా ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలని సూచించారు. ప్రజల సమస్యలను దగ్గరగా చూసిన వారే సమర్థవంతమైన నాయకులుగా ఎదుగుతారని చెప్పారు. భవిష్యత్తులో ఈ బాలికలే ప్రజాప్రతినిధులు, మంత్రులు, ముఖ్యమంత్రులుగా ఎదిగి సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాల్గొన్న బాలికలు సభా నిర్వహణలో చూపిన ఆత్మవిశ్వాసం, చర్చల్లో ప్రదర్శించిన అవగాహన అందరి ప్రశంసలను అందుకుంది. రాష్ట్రస్థాయి మాక్ అసెంబ్లీ కేవలం ఒక కార్యక్రమంగా కాకుండా భవిష్యత్ మహిళా నాయకత్వాన్ని తీర్చిదిద్దే శిక్షణ వేదికగా నిలిచిందనే అభిప్రాయం వ్యక్తమైంది. ప్రజాస్వామ్య విలువలు, ప్రజాసేవ భావన, నాయకత్వ నైపుణ్యాలను బాలికల్లో పెంపొందించడంలో ఈ కార్యక్రమం కీలక పాత్ర పోషించిందని పలువురు అభిప్రాయపడ్డారు.

# జకోరా-చందూర్ ఎత్తిపోతల ప్రారంభం

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**నిజామాబాద్, జూన్ 10 (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి):** నిజామాబాద్ జిల్లాలోని బాన్సువాడ నియోజకవర్గ రైతులకు సాగునీటి సౌకర్యాలను మరింత మెరుగుపరిచే దిశగా జకోరాచందూర్ ఎత్తిపోతల పథకాన్ని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. వంద ఆరు కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన ఈ పథకం ద్వారా వేలాది ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు పలు గ్రామాల తాగునీటి అవసరాలు కూడా తీరనున్నాయి. నిజాంసాగర్ జలాశయం నుంచి నీటిని ఎత్తిపోసే విధంగా రూపొందించిన ఈ పథకం ద్వారా వర్ని, చందూర్, మోస్రా రెవెన్యూ మండలాల పరిధిలోని నాలుగు వేల నాలుగు వందల డెబ్బై ఎకరాల భూమికి సాగునీరు అందనుంది. ఖరీఫ్, రబీ పంటల సాగుకు అవసరమైన నీటి లభ్యత పెరగడంతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని అధికారులు తెలిపారు.

ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం నీటిపారుదల రంగానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. సాగునీటి వసతులు మెరుగుపడితే వ్యవసాయ ఉత్పత్తి పెరిగి రైతుల ఆదాయం కూడా గణనీయంగా పెరుగుతుందని తెలిపారు. ప్రతి ఎకరాకు నీరు అందేలా ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతోందని చెప్పారు. ఎత్తిపోతల పథకం ప్రారంభం అనంతరం మంత్రి సిద్ధాపూర్ జలాశయ నిర్మాణ పనులను పరిశీలించారు. పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టు పనులను నాణ్యతతో పాటు వేగంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. రైతులకు త్వరగా ప్రయోజనాలు అందేలా ఎలాంటి జాప్యం లేకుండా పనులు కొనసాగించాలని ఆదేశించారు.

ఈ పథకం ద్వారా వ్యవసాయ అవసరాలకే కాకుండా పరిసర గ్రామాల తాగునీటి సమస్య కూడా కొంతవరకు పరిష్కారం కానుంది. నీటి కొరతను ఎదుర్కొంటున్న గ్రామాలకు ఇది ఎంతో ఉపయుక్తంగా మారనుందని స్థానిక ప్రజలు అభిప్రాయపడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నీటి భద్రతను బలోపేతం చేయడంలో ఈ పథకం కీలక పాత్ర పోషించనుంది. కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యుడు సురేష్ కుమార్ షెట్కార్, మాజీ శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి, నీటిపారుదల శాఖ కార్యదర్శి ఈ. శ్రీధర్, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రికి ఘన స్వాగతం పలికి సన్మానించారు. జకోరాచందూర్ ఎత్తిపోతల పథకం ప్రారంభంతో బాన్సువాడ ప్రాంత రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in